Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03


నెల్లూరు, 13.12.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 28 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com









## మీరొస్తామంటే...
# మేమొద్దంటామా?

- ఎన్డీఏలో చేరాలని వైసిపికి బీజేపీ ఆహ్వానం?
- వైసిపికంటే ముందు జొరబడేందుకు బాబు, పవన్ సన్నాహాలు
- రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే నిర్ణయం తీసుకోనున్న జగన్

*రాజకీయాలంటేనే మైండ్‌గేమ్... లాభ నష్టాల బేరీజు! ఈ మైండ్ గేమ్ ఆడడంలో సిద్ధహస్తులు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు. శత్రువును నయానోభయానో లొంగదీసుకోవడంలో ఆరితేరిపోయారు. సమయానుకూలంగా ఎవరిని దగ్గరకు తీసుకోవాలో... ఎవరిని దూరంగా నెట్టాలో... అన్నీ టైంకు చేస్తుంటారు.*

మోడీ, అమిత్‌షాలిద్దరూ ఇలాంటి మైండ్‌గేమ్‌నే ఇప్పుడు ఏపి రాజకీయాలలో మొదలుపెట్టారు. 2022లో జమిలి ఎన్నికలకు వెళ్లాలనే కృతనిశ్చయంతో కేంద్ర ప్రభుత్వం వుంది. అలా వెళ్లాలంటే అన్ని రాష్ట్రాలలో కూడా బీజేపీ గాని, దాని మిత్ర పక్షాలు గాని బలంగా వుండాలి. పూర్తి మెజార్టీ సాధించి బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావాలంటే ఇంకొన్ని ప్రాంతీయ పార్టీలను ఎన్డీఏలోకి తీసుకోవాల్సి వుంటుంది. బీజేపీకి చూస్తే దక్షిణాది రాష్ట్రాలలో కర్నాటకలో తప్పితే ఇంకెక్కడా బలంగా లేదు. నిన్నటి లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో నాలుగు సీట్లు సాధించడం ద్వారా బీజేపీకి ఈ రాష్ట్రంపై ఒక నమ్మకం ఏర్పడింది. టిఆర్ఎస్‌కు ఖచ్చితంగా పోటీ ఇస్తామని, వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాలేకపోయినా ప్రతిపక్ష స్థానానికైనా ఎగబాకుతామన్న ఒక భరోసా వచ్చింది. ఇక్కడ ఏ పార్టీతో పొత్తుపెట్టుకోవడానికి అవకాశం లేదు. అధికార టిఆర్ఎస్‌తో పడదు. బలంగా వుండే ఇంకో పార్టీ కాంగ్రెస్. కాబట్టి బీజేపీకి ఇక్కడ ఒంటరిగా పోటీ చేయక తప్పదు.

కాని ఏపిలో అలా కాదు. ఇక్కడ బీజేపీ ముందు మూడు మార్గాలున్నాయి. ఒకటి అధికారంలో వున్న వైసిపిని ఎన్డీఏలో చేర్చుకోవడం, వచ్చే ఎన్నికలలోనూ కలిసి పోటీ చేయడం. రెండో మార్గం తెలుగుదేశాన్ని మళ్ళీ దగ్గరకు తీయడం, చంద్రబాబుతో కలిసి మళ్ళీ పాత ప్రయాణం మొదలుపెట్టడం. ఇక మూడోది జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను పార్టీలోకి తీసుకోవడం, ఆయన నాయకత్వంలో ముందుకు పోవడం.

### వైసిపికి ఆఫరిచ్చారా?

ఎన్డీఏలో చేరమని వైసిపికి బీజేపీ అధిష్టానం నుండి ఆహ్వానం అందిందన్నది సమాచారం. బీజేపీకి అత్యంత సన్నిహిత పక్షమైన శివసేన కాంగ్రెస్ గూటికి వెళ్లిపోవడం తెలిసిందే! శివసేన వెళ్లినా మహారాష్ట్రలో బీజేపీకి ఇబ్బంది లేదు. సొంతంగా పోరాడగలదు. శివసేన స్థానాన్ని మరో బలమైన దక్షిణాది ప్రాంతీయ పార్టీతో భర్తీ (మిగతా 11వ పేజీలో)







# మౌనం వీడిన ఆనం

## అసంతృప్తికి ఆజ్యం



చెరువుల్లో స్వేచ్ఛగా విహరించే చేపలను తీసుకొచ్చి నీళ్ల బకెట్‌లో వేస్తే ఎంతగా విలవిలలాడిపోతాయో... మహాసముద్రం లాంటి కాంగ్రెస్ పార్టీలో నుండి బావుల్లాంటి ప్రాంతీయ పార్టీల్లోకి వచ్చిన నాయకులు కూడా అదేవిధంగా మదనపడిపోతుంటారు. వాళ్ళ పరిస్థితి అక్కడ వుండలేక, బయటకు పోలేక రెంటికీ చెడిన రేవడిలా వుంటుంది. ముఖ్యంగా సుదీర్ఘకాలం కాంగ్రెస్‌లో వున్న నాయకులెవరైనా సరే ఇతర పార్టీలలోకి, అందులోనూ ప్రాంతీయ పార్టీల్లోకి వెళ్లి మనుగడ సాగించలేరు. రాజకీయ నాయకులకు కాంగ్రెస్‌పార్టీ ఒక స్వర్గధామం లాంటిది. అక్కడ ప్రతిఒక్కరూ రాజులే! ప్రతిఒక్కరూ సేవకులే!

కాంగ్రెస్‌పార్టీ అనే మహావృక్షం ఈ రాష్ట్రంలో కూకటివేళ్ళతో సహా కూలిపోయింది. దీనిమూలంగా ఆ చెట్టునే నమ్ముకున్న రాజకీయ పక్షులెన్నో చెల్లాచెదురయ్యాయి. అలాంటివారిలో ఒకడే ఆనం రామనారాయణరెడ్డి.

కాంగ్రెస్ ఉన్నంత కాలం, కాంగ్రెస్‌లో 'ఆనం' ఉన్నంత కాలం వారిదే జిల్లా రాజకీయాలలో హవా! దివంగత నేత డాక్టర్ వై.యస్. (మిగతా 11వ పేజీలో)

# కావలిలో 14న జగన్నాథ రథయాత్ర



కావలిలోని ఇస్కాన్ ప్రచారకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14న 6వ శ్రీ జగన్నాథ రథయాత్రను ఎంతో వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఆరోజు మధ్యాహ్నం 2.30గంటలకు జగన్నాథ, బలదేవ, సుభద్రాదేవి మూర్తులను శోభాయమానంగా అలంకరించి స్థానిక బృందావనం కాలనీ వద్ద నుంచి పెద్దఎత్తున రథయాత్ర ప్రారంభిస్తామన్నారు. అక్కడినుంచి ట్రంకు రోడ్డు, ఆర్టీసి కూడలి, 5 లాంతర్ల సెంటర్, భాష్యం స్కూల్, వేపకాయల మిల్లు, జొన్నాయిగుంట వీధి, అక్కులబావి వీధి, కృష్ణుడిబొమ్మ సెంటర్, శివాలయం వీధి, తుమ్మలపెంట బస్టాండ్ కూడళ్ళ మీదుగా రథయాత్ర జరుగుతుందని తెలిపారు. రాత్రి 7 గంటలకు పిహెచ్ఆర్ఆర్ కల్యాణమండపంలో ముగింపు కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమంలో ఇస్కాన్ స్వాములు, ముఖ్యఅతిథులు పాల్గొని తమ సందేశాలను అనుగ్రహిస్తారని తెలిపారు. రథయాత్రలో కోలాట భజన బృందాలు, వేషధారణలు అందరినీ అలరిస్తాయని, భక్తులందరికీ విందు భోజన ప్రసాదాలుంటాయని తెలిపారు. భక్తులందరూ పెద్దసంఖ్యలో ఈ రథయాత్రలో పాల్గొని స్వామివార్ల కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు.

# రివర్స్ టెండర్లతో.. రికవరీ జోరు

## ఆల్తూరుపాడు టెండర్‌లో 67.81 కోట్లు ఆదా

జలవనరులశాఖ ప్రాజెక్ట్ పనుల్లో రివర్స్ టెండరింగ్ నిర్వహించడం వల్ల రికవరీలు జోరుగా జరుగుతున్నాయి. ఇటీవల దగదర్తి–రాచర్లపాడు, చినక్రాక బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కాలువ పనులకు రివర్స్ టెండర్స్‌తో పెద్దమొత్తమే ఆదా అయింది. ఇప్పుడు తాజాగా వెంకటగిరి నియోజకవర్గంలోని డక్కిలి మండలం ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులకు సంబంధించి జరిగిన రివర్స్ టెండర్ల వల్ల 67.81 కోట్ల రూపాయలు ఆదా కావడం ఎంతైనా విశేషం. ఆల్తూరుపాడు రిజర్వాయర్ నిర్మాణం కోసం ఎన్నికలకు నెలరోజుల ముందు గత ప్రభుత్వ పాలనలో హడావిడిగా టెండర్లు పిలిచేసి 253.77 కోట్లకు ప్రాజెక్ట్‌ను ఖరారుచేసి శంకుస్థాపన కూడా చేసేశారు. ఆ తర్వాత ఎన్నికల కోడ్ రావడంతో ఈ పనులు ప్రారంభం కాకముందే బ్రేక్ పడింది. కొత్త ప్రభుత్వం వచ్చాక, 25శాతం లోపు పనులు జరిగిన వాటిని రివర్స్ టెండర్ ద్వారా మళ్ళీ టెండర్లు పిలవాలని ఆదేశాలు జారీకావడంతో, పైన పేర్కొన్న 253.77 కోట్లను ప్రామాణికంగా తీసుకుని గతనెల 25న రివర్స్ టెండర్‌ను ఆహ్వానించారు. ఈ నెల 11న నెల్లూరులోని తెలుగుగంగ ఎస్ఇ కార్యాలయంలో ప్రాజెక్ట్ ఖరారు జరిగింది. ప్రాజెక్ట్ అంచనా వ్యయంలో 26.72 శాతం తక్కువకు కోట్ చేసిన బివిఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ప్రై.లిమిటెడ్ సంస్థకు దీనిని కేటాయించారు. దీంతో 67.81 కోట్ల రూపాయల ఆదాయం చేకూరినట్లయింది. ఈ టెండర్ ప్రక్రియలో పదిమంది కాంట్రాక్టర్లు పోటీపడగా వాటిలో ఇద్దరు అనర్హతకు గురయ్యారు. మిగిలిన 8 టెండర్లను ఎస్ఇ కె. హరినారాయణరెడ్డి పరిశీలించి ఖరారు చేశారు.

# రాజేశ్వరమ్మ ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారం

నెల్లూరు, దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారి దేవస్థానం కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారం ఈనెల 7వతేదీన ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఆలయ పాలకమండలి సభ్యులుగా తోట శోభారాణి, ఏలూరు శివయ్యనాయుడు, ఆంధ్ర పద్మ, కృష్ణ ప్రసాద్, జి.నరేష్, దారా లక్ష్మి, మాముడూరు కోటేశ్వరి, కట్టా వెంకట రమణయ్యలు ప్రమాణస్వీకారం చేశారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, నెల్లూరురూరల్ వైసిపి కార్యాలయ సమన్వయకర్త కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ పివివిఎస్ మూర్తి, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్ పాల్గొన్నారు.


# 20లోగా అక్రిడిటేషన్లకు దరఖాస్తులు

ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు, ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు 2020–2021 సంవత్సరాలకు సంబంధించిన అక్రిడిటేషన్ల కోసం ఈనెల 20 లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఐపిఆర్.ఏపి.జీఓవి.ఇన్‌లో జర్నలిస్టుల వివరాలను అప్ లోడ్ చేయాలని కోరారు. ప్రింట్ డాక్యుమెంట్ కాపీలను జతచేసిన పత్రాలతో దరఖాస్తులను రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులు కమిషనర్ సమాచార పౌరసంబంధాల శాఖ కార్యాలయం, విజయవాడకు, జిల్లా స్థాయి జర్నలిస్టులు సంబంధిత జిల్లాలోని పౌరసంబంధాలశాఖ డీడీ కార్యాలయానికి సమర్పించాలని కోరారు.

# 15 నుండి సీఐటీయు రాష్ట్ర మహాసభలు

నెల్లూరులో ఈనెల 15 నుండి 18 వరకు జరగనున్న సీఐటీయు రాష్ట్ర 15వ మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈనెల 10న బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. సీఐటీయు నాయకులు కటికాల వెంకటేశ్వర్లు, దుగ్గిరాల అన్నపూర్ణమ్మ, సుజాతమ్మ, సతీష్ పాల్గొన్నారు.

**సినీరంగంలో తనదంటూ ప్రత్యేక నటనా చాతుర్యంతో అశేష ప్రేక్షక జనాన్ని ఉర్రూతలూగించిన ప్రముఖ సినీనటుడు, రచయిత, వ్యాఖ్యాత గొల్లపూడి మారుతీరావు(80) ఈనెల12న అనారోగ్యంతో చెన్నైలో కన్నుమూశారు. ఆయనకు భార్య, పిల్లలు ఉన్నారు. నటునిగా, రచయితగా, వ్యాఖ్యాతగా, రేడియోలో ప్రయోక్తగా, పాత్రికేయరంగంలోనూ విలేకరిగా, సంపాదకునిగా.. విశేషమైన ప్రజ్ఞాపాటవాలున్న కళాకారుడు, సాహితీవేత్తగా ప్రఖ్యాతి చెందారు. ఒక్కమాటలో చెప్పాలంటే బహుముఖ ప్రజ్ఞాశాలి. మంచి స్నేహశీలి. ఆయన మరణం సినీరంగానికే కాక, కళా సాహిత్యరంగాలకు కూడా తీరని లోటు.**



## ప్రముఖ సినీనటుడు.. రచయిత.. వ్యాఖ్యాత.. జర్నలిస్టు

# గొల్లపూడి మారుతీరావు కన్నుమూత

ఒక వ్యక్తి ఒక రంగంలో ప్రత్యేకత సాధించడం సర్వసాధారణంగా జరిగేదే. అయితే పలు క్లిష్టమైన రంగాల్లో పరిణితి సాధించడమే కాక ప్రతిభతో రాణించడమంటే మాటలు కాదు. అది ఏ గొల్లపూడి వంటి వారికి మాత్రమే సాధ్యం. నిరంతరం అధ్యయనం, కళాతృష్ణ, సమాజాభ్యున్నతికి కృషిచేయాలనే తపన ఉన్నవారే అలాంటి బహుముఖ ప్రజ్ఞను సాధించగలరు. గొల్లపూడి మారుతీరావు ఆ కోవలో ముందువరుసలో ఉన్నవారు. రచయితగా, సినీనటునిగా ఆయన ప్రస్థానం ఎంతో విశేషమైనది.

### తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ

1934 ఏప్రిల్ 14న ఆయన విజయనగరంలో మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రులు అన్నపూర్ణ–సుబ్బారావు. భౌతికశాస్త్రంలో బిఎస్సీ పూర్తిచేసిన మారుతీరావు 1959లో ఆంధ్రప్రభ ఉపసంపాదకునిగా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించాడు. పాత్రికేయరంగంలో విలేకరిగా, సంపాదకునిగా, మంచి రచయితగా ఆయన బాగా రాణించారు. సినిమాల్లోకి రాకముందు నాటకాలు, కథలు, నవలలు రాశారు. తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించారు. తెలుగు సాహిత్యంపై ఆయన రచించిన వ్యాసాలు, పరిశోధనాత్మక రచనలు, నాటకాలు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా కూడా ఉన్నాయి. ఆ తర్వాత ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ, చెన్నై, కడప కేంద్రాల్లో ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశారు. 1981లో ఆకాశవాణి కడప కేంద్రం డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి పొంది ఇరవై ఏళ్ళు పనిచేసి అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు పదవీ విరమణ చేశారు.

### సినీరంగ ప్రస్థానం

తొలి నుంచి సాహిత్యం, కళలు, నటనా రంగం పట్ల ఆసక్తి ఉన్న గొల్లపూడి మారుతీరావు చిన్నవయసులోనే 'రాఘవ కళానికేతన్'ను ప్రారంభించి నాటక బృందాన్ని ఏర్పాటుచేసుకుని నాటకాలు వేసేవారు. పలు నాటకాలకు దర్శకత్వ, నిర్మాణ బాధ్యతలతోపాటు, నటునిగా కూడా ప్రధాన పాత్రధారిగా ఉండేవారు. ఆ తర్వాతి కాలంలో ఆయన రచించిన 'అనంతం' నాటకం ఉత్తమ రేడియో నాటకంగా అవార్డును సాధించింది. 1963లో తొలిసారిగా 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి స్క్రీన్ ప్లే రాశారు. తొలిప్రయత్నంలో ఆ రచన అత్యుత్తమంగా ఉండి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం నుంచి ఉత్తమ కథా రచనకుగాను ఆయనకు నంది అవార్డు లభించడం విశేషం. నటునిగా ఆయన తొలిచిత్రం 'ఇంట్లో రామయ్య వీధిలో కృష్ణయ్య'లో బాగా రాణించడంతో ఆయన మంచినటునిగా, హాస్యనటునిగా కూడా సినీరంగంలో పేరుతెచ్చుకున్నారు. సుమారు 250 చిత్రాలకు పైగానే సహాయనటునిగా, హాస్యనటునిగా.. అద్వితీయంగా నటించి అందరి కరతాళధ్వనులందుకున్నారు.

### ఎన్నెన్నో అవార్డులు

దేశవిదేశాల్లో సైతం ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులను, ఘన సత్కారాలను, బిరుదులను అందుకున్న గొప్ప నటుడు గొల్లపూడి. 'డాక్టర్ చక్రవర్తి' చిత్రానికి ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా, ఆత్మగౌరవం, కళ్ళు చిత్రాలకు ఉత్తమ రచయితగా, మాస్టారి కాపురం చిత్రానికి ఉత్తమ సంభాషణల రచయితగా, తరంగిణి చిత్రంలో ఉత్తమ హాస్యనటునిగా ఆయన రాష్ట్ర ప్రభుత్వం నుంచి 'నంది' అవార్డులను అందుకున్నారు. 1975లో 'కళ్ళు' నాటకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. ఆయన రచించిన 'ప్రశ్న' అనే నాటకానికి అఖిలభారత స్థాయిలో మహాత్మా గాంధీ సృజనాత్మక సాహిత్య పురస్కారం రావడం ఆయన రచనా ప్రతిభకు నిదర్శనం. ఆయన మృతితో సినీరంగమే కాక, కళా సాహితీరంగాలు కూడా శోకసాగరంలో మునిగిపోయాయి.

# నెల్లూరుతో అనుబంధం


- తొలి 'తుంగా అవార్డు' గొల్లపూడికే...



'తుంగా అవార్డు'ను అందుకుంటున్న గొల్లపూడి

సుప్రసిద్ధ నటుడు, రచయిత గొల్లపూడి మారుతీరావుకు నెల్లూరుతో మంచి అనుబంధం ఉంది. 1995 జనవరి 18న 'లాయర్' పత్రికా సంపాదకులు తుంగా రాజగోపాలరెడ్డి గారు దివంగతులయ్యాక, ఆయన పుట్టినరోజైన నవంబర్ 8వ తేదీన ఆయనకు ప్రీతిపాత్రమైన రంగాల్లో ఉన్న ప్రతిభావంతులను సత్కరించాలనే ఉద్దేశ్యంతో 1996 నుంచి నెల్లూరులో 'లాయర్' వారపత్రిక ఆధ్వర్యంలో 'తుంగా అవార్డు' ఏర్పాటుచేయడం జరిగింది. పత్రికారంగంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఈ అవార్డును అందుకోవడానికి ఆయా రంగాల్లో ఉన్న ప్రతిభామూర్తులను ఎంపికచేయడం జరిగేది. ఈ నేపథ్యంలో తొలి 'తుంగా పండుగ' రోజున కీర్తిశేషులు తుంగా రాజగోపాలరెడ్డి అవార్డును అందుకున్న విశేష ప్రజ్ఞావంతుడు గొల్లపూడి మారుతీరావు. జర్నలిజం రంగంలో అద్వితీయమైన కృషిచేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డును బహూకరించడం జరిగింది. 1996 నవంబరు 8వ తేదీన నెల్లూరు పురమందిరంలో జరిగిన తుంగా పండుగ వేడుకలో డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి సమక్షంలో, లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి చేతుల మీదుగా గొల్లపూడి మారుతీరావును 'తుంగా అవార్డు'తో ఘనంగా సత్కరించడం జరిగింది. ఆ వేడుక చిరస్మరణీయం.

### డా.నాగభైరవ అవార్డు



ఆ తర్వాత, 2015 నవంబరు 15వ తేదీన ఆయన నెల్లూరుకు వచ్చారు. నెల్లూరులో ప్రసిద్ధ సాహితీవేత్త దివంగత డా.నాగభైరవ కోటేశ్వరరావు స్మారకంగా ఏర్పాటుచేసిన 'డా. నాగభైరవ అవార్డు'ను గొల్లపూడి మారుతీరావుకు బహూకరించారు. సినీకవి వెన్నెలకంటి, ప్రముఖ సాహితీవేత్త చిన్ని నారాయణరావు తదితరుల సారథ్యంలో గొల్లపూడి మారుతీరావు ఈ అవార్డును అందుకున్నారు. లాయర్ వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డును బహూకరించారు. ఇలా.. నెల్లూరుతో గొల్లపూడి వారికి ఉన్న ఆత్మీయతానుబంధం ఎనలేనిది.

ఏదేమైనా, మారుతీరావు మరణం నెల్లూరీయులందరినీ శోకతప్తుల్ని చేసింది. ఆ మహనీయునికి 'లాయర్' కన్నీటి నివాళి.

# హాఫ్ సెంచరీ





అంతరిక్ష ప్రయోగాలలో అగ్రరాజ్యాలకు ధీటుగా దూసుకుపోతున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఈనెల 11వ తేదీన మరో మైలురాయిని అధిగమించింది. ఇస్రోకు అత్యంత నమ్మకంగా మారిన పిఎస్ఎల్వి సీరీస్ ప్రయోగాలలో హాఫ్ సెంచరీని పూర్తి చేసుకోగా, మొత్తం 75ప్రయోగాలతో ప్లాటినం జూబ్లీ చేసుకుంది.

ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 3.25గంటలకు శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్)లోని రెండవ ల్యాంచింగ్ ప్యాడ్ నుండి ప్రయోగించిన పిఎస్ఎల్వి-సి48 విజయవంతమైంది. ఈ ప్రయోగం ద్వారా 648 కిలోల బరువు కలిగిన రీశాట్-2బిఆర్1 ఉపగ్రహంతో పాటు అమెరికాకు చెందిన 4 లీమూర్ అనే ఉపగ్రహాలు, టైవోక్-0129, ఆరు ఐహోప్ శాట్ ఉపగ్రహాలు, జపాన్‌కు చెందిన క్యూపిఎస్-సార్, ఇటలీకి చెందిన తైవాక్-0092, ఇజ్రాయిల్‌కు చెందిన డచీఫ్యాట్-3 ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టగలిగారు. స్వదేశీ ఉపగ్రహమైన రీశాట్-2బిఆర్1 ద్వారా వ్యవసాయం, అటవీ, విపత్తు నిర్వహణలకు సంబంధించిన సేవలు అందనున్నాయి. ఈ ఏడాది మే 22న కక్ష్యలో ప్రవేశపెట్టిన రీశాట్-2బికి కొనసాగింపుగానే ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించారు.

కాగా పిఎస్ఎల్వి-సి48 ప్రయోగంతో ఇస్రో అటు ప్రయోగాలలో 75వ మార్క్‌ను, పిఎస్ఎల్వి సీరీస్‌లో 50 మార్క్‌ను అందుకుంది.

ముఖ్యంగా పిఎస్ఎల్వి సీరీస్ విజయపరంపర అంతరిక్ష వాణిజ్యాభివృద్ధికి బాటలు వేస్తోంది. ఇప్పటి వరకు 50 పిఎస్ఎల్వి ప్రయోగాలు నిర్వహించగా వాటిలో రెండు మాత్రమే విఫలమయ్యాయి. పిఎస్ఎల్వి ద్వారానే 300కుపైగా విదేశీ ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపి అంతరిక్ష మార్కెట్‌పై ఆధిపత్యం సాధించే దిశగా ఇస్రో దూసుకుపోతోంది.

## పెట్టుబడి ప్రోత్సాహకాలు మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా

# ప్రతాప్ భీమిరెడ్డి నియామకం



ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రతాప్ భీమిరెడ్డి

ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు మార్గదర్శకం చేయడమేకాకుండా వారిని ఆకర్షించే విధంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రతినిధిగా ప్రతాప్ భీమిరెడ్డిని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది.

ప్రతాప్ భీమిరెడ్డిది గుంటూరుజిల్లా. సాఫ్ట్‌వేర్ రంగంలో విశేష అనుభవంతో నూతన ఆలోచన విధానాలతో వినూత్న ఉత్పత్తుల రూపకల్పనతో పాటు ఆచరణ అనుసరణీయ విధానాలలో కూడా పలు కంపెనీల ప్రశంసలను ప్రతాప్ అందుకున్నాడు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీతో పాటు ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక సంస్కరణలు, బీమా రంగం వంటి విభాగాలలో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది, మెక్సికో, యూరప్, కెనడా, అమెరికా వంటి దేశాలలో విశేష అనుభవాన్ని సాధించాడు ప్రతాప్.

ప్రతాప్ భీమిరెడ్డికున్న అపార అనుభవాన్ని, వ్యాపార దృక్పథాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలో విదేశీ పెట్టుబడిదారులను ప్రోత్సహించడంతో పాటు వారిని ఆకర్షించడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేయగల సత్తా సమర్థత ప్రతాప్ భీమిరెడ్డికి వున్నాయని గుర్తించిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆయనకు ప్రత్యేక ప్రతినిధి పదవిని కట్టబెట్టారు.

2006 నుండి గత 13 సంవత్సరాలుగా వ్యాపార రంగంలో విశేష కృషితో ఉన్నత శిఖరాలు అధిరోహించిన ప్రతాప్ ఓ వైపు వ్యాపార లావాదేవీలను చూసుకుంటూనే మరోవైపు నార్త్ అమెరికా తెలుగు అసోసియేషన్(నాటా) సభ్యుడిగా సామాజిక సేవలు అందిస్తూ, రాజకీయ పరంగా తనకు బాగా ఇష్టమైన దివంగత నేత డా॥ వైయస్ రాజశేఖరరెడ్డి గారి తనయుడు వైయస్ జగన్మోహన్‌రెడ్డికి తన పూర్తి సహాయ సహకారాలను అందిస్తూ వచ్చాడు.

నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్శిటీకి కూడా భూరి విరాళాన్ని అందించి ఉత్తమ విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇచ్చే కార్యక్రమం ద్వారా నెల్లూరీయులకు కూడా ప్రతాప్ పరిచయస్తుడే. ఈ యువ ప్రత్యేక ప్రతినిధికి 'లాయర్' అభినందనలు.

# విభజన హామీలు ఏమయ్యాయి?

## - రాజ్యసభలో ప్రశ్నించిన విపిఆర్



ఈ నెల 11వ తేదీన రాజ్యసభలో జరిగిన చర్చలో రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెవెన్యూ లోటుకు సంబంధించిన వివరాలు, పదవ షెడ్యూల్ క్రిందవున్న సంస్థలు, రాజధానికి నిధులు, వెనుకబడిన జిల్లాలకు ఆర్థిక సాయం, పోలవరం ప్రాజెక్ట్, దుగరాజపట్నం పోర్టు నిర్మాణం, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ వంటి హామీలను ఆయన ప్రస్తావించారు. దీనికి కేంద్ర హోం అఫైర్స్ శాఖ మంత్రి నిత్యానందరామ్ సమాధానమిస్తూ నీతిఆయోగ్ వైస్‌ఛైర్మెన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అందించే సహకారంపై 2015 డిసెంబర్‌లో ఒక నివేదిక అందించారని, అప్పటి ప్రధాని ఇచ్చిన హామీలు, సిఫారసుల ఆధారంగా ఈ నివేదిక వుందన్నారు. ఏపికి పన్ను ప్రోత్సాహకాలతో పాటు, 2014-15 సంవత్సరానికి వనరుల అంతరాయాన్ని తగ్గించడానికి గ్రాంట్ మంజూరు, రాయలసీమ, ఉత్తరాంధ్రలోని 7 జిల్లాల అభివృద్ధికి కొత్త మూలధన అభివృద్ధికి ఆర్థికసాయం, పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం, కొత్త ప్రధాన ఓడరేవును నిర్మించడానికి వేగంగా చర్యలు తీసుకోవడం, జాతీయ విద్య, వైద్య సంస్థల స్థాపనను వేగవంతం చేయడం వంటివి ఇందులో వున్నాయని ఆయన తెలపడం జరిగింది. అలాగే దేశంలోని 4వేల నగరాలు మరియు పట్టణాలను శ్రేణుల వారీగా విభజించడానికి కేంద్రం ఒక సర్వే నిర్వహించిందన్న విషయం వాస్తవమా? కాదా అని విపిఆర్ ప్రశ్నించారు. దీనికి కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి సమాధానమిస్తూ సర్వేక్షన్-2019 సర్వే ప్రకారం నగరాలను నాలుగు విభాగాలుగా కేటాయించడం, వాటిని పరిశుభ్రంగా వుంచడానికి వివిధ రకాల రేటింగ్ ఇవ్వడం జరుగుతోందని చెప్పారు.

అలాగే 12వ తేదీన సభలో జరిగిన చర్చలో ఆయన దేశంలో జరుగుతున్న సైబర్ దాడులపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సైబర్ దాడులను ఎదుర్కోవడానికి కేంద్రం తీసుకుంటున్న చర్యలను గురించి అడగ్గా కేంద్ర సమాచార ఐ.టి శాఖామంత్రి దీనికి సంబంధించి పూర్తి గణాంకాలను వివరించారు.

## విజయసాయిని కలిసిన కోర్సపాటి



అమెరికాలో తెలుగువారి సత్తా చాటుతున్న నాటా ప్రెసిడెంట్ ఎలక్ట్ మరియు వైయస్సార్‌సీపీ అమెరికా విభాగం కన్వీనర్ డా॥ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి డిసెంబర్ 8వ తేదీ ఆదివారం హైదరాబాదులో వైసిపి ఎం.పి విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశాడు.

ఇటీవల అమెరికాలో జరిగిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతం కావడానికి సహకరించినందుకు సాయిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.



ఈ నెల 11న నెల్లూరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఎం.వి.శేషగిరి బాబును తొలిసారి మర్యాదపూర్వకంగా కలుసుకున్న జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్




## 'ప్రభా'తం

# జనం మెచ్చిన తీర్పు



'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా మేధావులు, న్యాయనిపుణులు, మానవహక్కుల సంఘం నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి ఎన్‌కౌంటర్ తీర్పులు ప్రజాస్వామ్య, న్యాయవ్యవస్థల మనుగడను ప్రశ్నార్ధకం చేస్తాయని భావిస్తున్నారు. సంఘటనలను బట్టి బాధితులకు సత్వరన్యాయం అందించాలంటే అందుకు తగినట్లుగా చట్టాల రూపకల్పన జరగాలి. రేప్ కేసుల్లో నిందితులకు 21రోజుల లోపు ఉరిశిక్ష పడేలా ఏపి శాసనసభలో ముఖ్యమంత్రి వై.యస్.జగన్ చట్టం తీసుకురావాలనే ప్రయత్నం దీనికొక ముందడుగుగా చెప్పకోవచ్చు.

దేశవ్యాప్తంగా సంచలనం కలిగించి, అంతర్జాతీయ మీడియా సైతం దృష్టిపెట్టిన 'దిశ' కేసుకు నాలుగు తూటాలతో పోలీసులు ముగింపు పలికారు. 'దిశ' దారుణంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు తలెత్తాయి. నిందితులు నలుగురినీ ఎన్‌కౌంటర్ చేసి పారేయాలంటూ కోట్ల గొంతులు నినదించాయి. ఈ కేసు కోర్టుల పరిధిలోకి వెళితే ఏళ్ల తరబడి విచారణ పేరుతో కాలయాపన జరుగుతుందని, నిందితులకు శిక్షపడేసరికి చాలా కాలం పడుతుందని, కాబట్టి వాళ్ళను తక్షణం ఎన్‌కౌంటర్ చేయడమే తమ కోరికగా ప్రజలు తమ నిరసన ద్వారా తెలిపారు.

ఇన్ని కోట్ల మంది ఒకేరకమైన తీర్పు కోరుకున్నప్పుడు పోలీసులకు కూడా ఆ తీర్పును అమలు చేయడమే సబబు అనిపించినట్లుంది. హైదరాబాద్ శివార్లలో ఔటర్‌రింగ్‌రోడ్డు ప్రాంతంలో ఎక్కడైతే 'దిశ'ను కిరాతకంగా మానభంగం చేసి, అత్యంత దారుణంగా, క్రూరాతి క్రూరంగా పెట్రోల్ పోసి చంపారో, అదే ప్రాంతంలో పోలీసులు నలుగురు నిందితులను కాల్చి చంపారు.

సంఘటన తెలిసిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగడం, నిందితులను అరెస్ట్ చేయడం జరిగాయి. అయితే వేలాదిమంది ప్రజలు షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను చుట్టుముట్టి వారిని మీరన్నా చంపండి, లేదంటే మాకు అప్పగిస్తే మేమన్నా చంపేస్తాం అంటూ ఆవేశంతో వూగిపోతున్న తరుణంలో, పోలీసులు నిందితులను కోర్టుకు కూడా తీసుకుపోలేక, న్యాయమూర్తినే పోలీసుస్టేషన్‌కు రప్పించి, వారిని విచారించి రిమాండ్‌కు ఆదేశించారు. నలుగురు నిందితులను కూడా చర్లపల్లి జైలుకు తరలించాక ప్రజలు మరింత ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఎందుకంటే నిందితులను న్యాయస్థానాల పరిధిలోకి వదిలేస్తే, వాళ్ళకు శిక్షలు పడేసరికి తెల్లారుతుందని, అదీగాక సరైన సాక్ష్యాలు లేకుంటే ఇలాంటి నిందితులు తప్పించుకునే ప్రమాదం కూడా వుందని, కాబట్టి జైలుకు పంపించకముందే ఆ క్రూరులను ఎన్‌కౌంటర్‌లో చంపేయాలన్నది ప్రజల డిమాండ్. ఈ విషయంలో తెలంగాణ ప్రజలు దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డినే మరీమరీ గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సీఎం కేసీఆర్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. వైయస్ లాంటి దమ్మున్న సీఎం వుంటే అప్పుడు వరంగల్ యాసిడ్ దాడి నిందితులను ఎన్‌కౌంటర్ చేసినట్లే వీళ్లను కూడా కాల్చిపడేసి వుండేవాళ్ళని ప్రజలు భావించసాగారు.

ఈ దశలో పోలీసులు పూర్తి వివరాలు రాబట్టడానికి నిందితులను తమ కస్టడీకి అప్పగించాలంటూ మహబూబ్‌నగర్ కోర్టులో పిటిషన్ వేయడం, కోర్టు అందుకు అనుమతించడంతో సీన్ మారిపోయింది. సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం పోలీసులు నిందితులను సంఘటన జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లడం, అక్కడ నిందితులు పారిపోయే ప్రయత్నంలో పోలీసులపై దాడి చేయడం, దాంతో పోలీసులు ఆత్మరక్షణ కోసం నిందితులు నలుగురినీ కాల్చిచంపడం జరిగిపోయాయి.

'దిశ' సంఘటనలో ప్రజలు ఏదైతే ఆశించారో, పోలీసులు అది నెరవేర్చారు. ఎన్‌కౌంటర్ సంగతి తెలియగానే ప్రజలు వీధుల్లోకి వచ్చి పోలీసులకు జేజేలు పలుకుతున్నారు. అంతకుముందురోజు వరకు విలన్‌లుగా చూసిన పోలీసులే ఒక్కసారిగా హీరోలయ్యారు.

ఈ ఎన్‌కౌంటర్‌ను ప్రజలు ఎందుకు హర్షిస్తున్నారు... ఇలాంటి కేసుల్లో ప్రజలు ఇలాంటి తీర్పులనే ఎందుకు కోరుకుంటున్నారు? మన దేశంలో పటిష్టమైన న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు, న్యాయస్థానాలు వుండగా, ఎన్నో పదునైన చట్టాలు వుండగా, వాటిల్లో నేర నిరూపణ జరిగి నిందితులను శిక్షించే అవకాశం వుండగా, కేవలం ఒకేఒక్క ఎన్‌కౌంటర్‌ను మాత్రమే ప్రజలు ఎందుకు ఆహ్వానిస్తున్నారు? దీనిపై లోతైన విశ్లేషణ జరగాలి. కోర్టుల్లో కేసుల విచారణ, శిక్షల అమలు ఏళ్ల తరబడి సాగుతుంటుంది. వందమంది దోషులు తప్పించుకున్నా ఫర్వాలేదుగాని, ఒక్క నిర్దోషికి శిక్ష పడకూడదు అని మన చట్టాలు చెబుతున్నాయి. అయితే, దీనిని సాకుగా తీసుకుని మనవాళ్ళు వంద మంది దోషులను వదిలేస్తుంటారు.

మన దేశంలో జరుగుతున్న నేరాలకు, శిక్షలు పడుతున్న కేసులకు వ్యత్యాసం భారీగా వుంటోంది. వందకు 20 కేసులు కూడా రుజువు కావు. ఎందు కంటే కాలయాపనతో సాక్ష్యాలు వీగిపోతాయి. బాధి తుల్లో కూడా ఆ కసి తగ్గిపోతుంది. రాజీ ధోరణి వచ్చేస్తోంది. కాబట్టే కోర్టుల ద్వారా అమలయ్యే న్యాయం కంటే ఇలాంటి ఎన్‌కౌంటర్‌ల న్యాయం వైపే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. ఇక్కడ ఇంకో విషయం ఏంటంటే... 'దిశ' వంటి విద్యావంతులు, ఉన్నతవర్గాల మహిళలపై అత్యాచారాల విషయంలోనే ప్రభుత్వాలు, పోలీసులు స్పందిస్తారా? దళిత బడుగు బలహీన వర్గాల మహిళలపై రోజూ అత్యాచార దాడులు, హత్యలు జరుగుతూనే వున్నాయి. మరి ఆ కేసుల్లో నిందితులను ఎన్‌కౌంటర్ చేయరా? 'దిశ' కేసులో నిందితులు బలహీనవర్గాలకు చెందినవాళ్ళు కాబట్టి ఎన్‌కౌంటర్ చేశారు. అదే దళిత యువతులను అత్యాచారం, హత్య చేసిన కేసుల్లో అగ్రవర్ణాల వాళ్ళు, రాజకీయ నాయకుల పిల్లలు వుంటే వారిని ఎన్‌కౌంటర్ చేస్తారా? ఇలాంటి ప్రశ్నలెన్నో వస్తున్నాయి. కేసు ఏదైనా, ఎవరిదైనా.. ప్రతి నేరానికి శిక్ష సత్వరం పడి అమలు జరిగితే ఎన్‌కౌంటర్‌ల డిమాండ్ రాదు.

'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నా మేధావులు, న్యాయనిపుణులు, మానవహక్కుల సంఘం నుండి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఇలాంటి ఎన్‌కౌంటర్ తీర్పులు ప్రజాస్వామ్య, న్యాయవ్యవస్థల మనుగడను ప్రశ్నార్ధకం చేస్తాయని భావిస్తున్నారు. ఏదైనా చట్టం న్యాయస్థానం ద్వారానే జరిగిపోవాలన్నది, న్యాయ ప్రక్రియ మార్గం సక్రమదారిలో వుండాలన్నది వీరి అభిప్రాయం. సంఘటనలను బట్టి బాధితులకు సత్వరన్యాయం అందించాలంటే అందుకు తగినట్లుగా చట్టాల రూపకల్పన జరగాలి. రేప్ కేసుల్లో నిందితులకు 21రోజులలోపు ఉరిశిక్ష పడేలా ఏపి శాసనసభలో ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో చట్టం తీసుకురావాలనే ప్రయత్నం దీనికొక ముందడుగుగా చెప్పుకోవచ్చు.

# భవసాగరాన్ని దాటించే నావ.. భగవద్గీత

**- అవధాని కోట రాజశేఖర్**



భగవద్గీత పరమ పవిత్రమైన గ్రంథమని, కష్టాలమయమైన భవ సాగరాన్ని దాటించే నావ భగవద్గీతేనని, భగవద్గీత పఠనం ద్వారా మానవాళి జీవితాలకు ధన్యత చేకూరుతుందని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 7న నెల్లూరులోని టిటిడి కల్యాణమండపంలో జరిగిన 'గీతా జయంతి' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రపంచంలో ఎంతోమందికి జయంతివేడుకలు జరుగుతుంటాయని, అయితే ఒక గ్రంథానికి జయంతి ఉత్సవాలు జరుగుతుండడం ప్రపంచంలో ఒక్క భగవద్గీతకేనని అంటూ గీతా వైశిష్ట్యాన్ని వివరించారు. ప్రపంచ మానవాళికి మార్గనిర్దేశం చేసే ఆదర్శగ్రంథం, ధర్మాన్ని ప్రబోధించి, కర్తవ్యాన్ని బోధించే మహత్తరమైన గ్రంథం భగవద్గీతేనని అన్నారు. మహాత్మాగాంధీజీ కూడా తన మనసుకు ఏ కష్టం వచ్చినా భగవద్గీతలోని శ్లోకాలను చదువుకుని ఉపశమనం పొందుతుంటానని అన్నారని, భగవద్గీత ఎన్నెన్నో గొప్పగుణాలతో సమకూర్చిన పుష్పమాలిక వంటిదని స్వామీ వివేకానంద కొనియాడారని ఆయన గుర్తు చేశారు.

**విజేతలు వీరే...** ఈ సందర్భంగా భగవద్గీత పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులందజేశారు. 6,7 తరగతుల విభాగంలో దివిజా వాగ్దేవి ప్రథమ బహుమతిని సాధించగా జి.భవిష్య, సి.లహరిలు ద్వితీయ తృతీయ బహుమతులు అందుకున్నారు. 8,9 తరగతుల విభాగంలో వరుసగా ఎ.సుధీర్, జి.చెంచులక్ష్మి, ఎం.వైష్ణవిలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. టిటిడి విశ్రాంత కోఆర్డినేటర్ మల్లేల శ్రీహరి, అవధాని కోట రాజశేఖర్, బొగ్గరపు రాధాకృష్ణమూర్తి, సంస్కృతోపన్యాసకులు డా. ఎం. రామచంద్రరావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. టిటిడి ధర్మప్రచార పరిషత్ జిల్లాశాఖ ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్.దేవరాజులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిటిడి ధర్మప్రచార మండలి మాజీ అధ్యక్షులు సివి సుబ్రహ్మణ్యం, టిటిడి కల్యాణమండపం మేనేజర్ మునిరత్నం, శ్రీవేంకటేశ్వర కల్యాణమహోత్సవ సేవాసమితి అధ్యక్షులు ఇకె సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. అనంతరం లావణ్య బృందం వారు నిర్వహించిన కోలాట ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.




## న్యాయ వ్యవస్థలపై నమ్మకం లేకే!

'దిశ' కేసులో నలుగురు నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేయడాన్ని ప్రజలు హర్షిస్తున్నారు. వాస్తవానికి కేసు కోర్టు బోనెక్కకుండానే శిక్ష అమలు జరిగినట్లయ్యింది. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలంటూ ప్రజలు బహిరంగంగానే డిమాండ్ చేశారు. ఇక్కడ ప్రజలకు న్యాయస్థానాల ద్వారా న్యాయం జరుగుతుందనే నమ్మకం లేకుండా పోతోంది. ఏళ్ల తరబడి కేసులు కోర్టుల్లో సాగదీస్తుండడం, ఎన్నో కేసుల్లో నిందితులు నిర్దోషులుగా బయటకు వస్తుండడం, అతి క్రూరమైన కేసుల్లో ఉరిశిక్ష పడ్డ నిందితులకు సైతం ఆ శిక్షను అమలుచేయడానికి జాప్యం జరుగుతుండడం, కొందరికి ఉరిశిక్ష నుండి క్షమాభిక్ష పేరుతో ఉపశమనం కలుగుతుండడం వంటి కారణాల వల్ల కూడా ప్రజలు చట్టాలకు అతీతమైన ఎన్‌కౌంటర్లను కోరుతున్నారు.

**బి.ఉమామహేశ్వరరావు, నెల్లూరు.**

## మద్యపానంపై చర్యలు భేష్

రాష్ట్రంలో మద్యం నియంత్రణ కోసం ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. రాష్ట్రంలో దశలవారీగా మద్యపాన నిషేధం అమలులోకి తెస్తానని జగన్మోహన్‌రెడ్డి చెప్పి వున్నారు. ఆయన అమలులోకి తెస్తున్న నూతన విధానాల వల్ల రాష్ట్రంలో మద్యం అమ్మకాలు తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొన్ని వర్గాల ప్రజలు పూర్తిగా మద్యానికి దూరమైతే కనీసం వారి కుటుంబాలన్నా బాగుపడతాయి. అదే సమయంలో తక్కువ ధరతో నకిలీ మద్యం మార్కెట్లో దొరుకుతోంది. దీనిపై కూడా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

**లెక్కల నారాయణరెడ్డి, నెల్లూరు.**

## పేదలను కొట్టి వాళ్ళకు పెట్టాలా?

ఈరోజు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేది పేద, మధ్య తరగతి ప్రజలే! ఆర్టీసీ ఛార్జీల పెంపు ద్వారా ప్రభుత్వం వారిపై భారం మోపడం అన్యాయం. ఓపక్క ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంటున్నారు, ఇంకోపక్క లెక్కలేకుండా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తున్నారు. వీటిలో దండగమారి సంక్షేమ కార్యక్రమాలు ఎన్నో వున్నాయి. వాటన్నింటని ఎవరు అమలు చేయమన్నారు? ఇక్కడ ఆర్టీసీ ఛార్జీలు పెంచి సామాన్య ప్రజలను ఎవరు బాదమన్నారు..?

**కేశవరం ప్రసన్న, గూడూరు.**

## రోడ్లను బాగుచేయండి!

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు దాటింది. ఇంతవరకు నెల్లూరు నగరంలో రోడ్లను బాగు చేయలేదు. తెలుగుదేశం ప్రభుత్వంలో రోడ్లను చెడగొట్టి పెట్టారు. అప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలుగా వున్న నాయకులు వీటి గురించి విమర్శలు చేశారు. ఎన్నికల ప్రచారంలోనూ ఆరోపణలు చేశారు. ఇప్పుడు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మంత్రిగా వున్నాడు, అధికారపక్షంలో వున్నాడు. టీడీపీ వాళ్ళు చెడగొట్టిన రోడ్లను మీరన్నా బాగుచేయండి.

**వై.రాఘవరావు, నెల్లూరు.**



నెల్లూరుజిల్లా తెలుగుదేశం పార్టీలో బలహీనవర్గాల నుండి బలమైన నాయకుడు మాజీశాసనసభ్యులు బీద మస్తాన్‌రావు తెలుగుదేశాన్ని వీడి వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరాడు.

# వైసిపికొచ్చేసిన మస్తాన్‌రావు

- జగన్ సమక్షంలో వైసిపిలో చేరిక
- త్వరలో రాజ్యసభకు వెళ్లే ఛాన్స్

ఈనెల 7వ తేదీన బీద మస్తాన్‌రావు తాడేపల్లిలోని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి నివాసంలో ఆయన సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నాడు. రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పి.అనిల్ కుమార్‌యాదవ్, కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మస్తాన్‌రావుతో పాటు ఆయన బావ, కావలి ఏఎంసి మాజీఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం కూడా వైసిపిలో చేరాడు.

### విజయసాయిరెడ్డిదే స్కెచ్

బీద మస్తాన్‌రావును వైసిపిలో చేర్చడంలో విజయసాయిరెడ్డి కీలకపాత్ర పోషించాడు. విజయసాయిరెడ్డికి బిఎంఆర్ అత్యంత సన్నిహితుడు. ఇద్దరూ సుధీర్ఘకాలంగా వ్యాపార భాగస్తులే! ఎలక్షన్ ముందుదాకా బిఎంఆర్ తెలుగుదేశంలో వున్నప్పటికీ, ఎన్నికల తర్వాత ఆయనను వైసిపిలోకి తేవడం విజయసాయిరెడ్డికి సులువైంది.

### రాజ్యసభ ఖరారైనట్లే!

ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి గెలిచి పార్లమెంటులో అడుగుపెట్టాలనుకున్న బిఎంఆర్ కలలు జగన్ సుడిగాలిలో కొట్టుకుపోయాయి. రాష్ట్రమంతా జగన్ గాలి వీచినా నెల్లూరు లోక్‌సభ నుండి గెలుస్తాననే నమ్మకం ఆయనకు బలంగా వుండింది. అందుకే ఆ ఎన్నికల్లో ఖర్చుకు వెనుకాడకుండా పెట్టాడు. కాని ఫలితాలు తీవ్ర నిరాశ పరిచాయి. ఇక పార్లమెంటులో అడుగుపెట్టాలంటే ఆయన ముందున్న మార్గం వైసిపిలోకి జంప్ చేయడం. విజయసాయిరెడ్డి ద్వారా ట్రాక్ ఏర్పడింది. వైసిపి నుండి బీసీలలో ఒకరిని వచ్చే రాజ్యసభ ఎన్నికల ద్వారా ఎంపిక చేయాల్సి వుంటుంది. ఆర్థికగా గట్టిగా వుండే బిఎంఆర్ అయితే సెట్ అయిపోతాడని చెప్పి ఆయనకు లైన్ క్లియర్ చేశారు.

### కావలి 'దేశం'కు పెద్దలోటు

బిఎంఆర్ వైసిపిలోకి వెళ్ళడంతో కావలి నియోజకవర్గ తెలుగుదేశంలో నాయకత్వ శూన్యత ఏర్పడినట్లయ్యింది. బిఎంఆర్ సోదరుడు బీద రవిచంద్ర తెలుగుదేశంలోనే వున్నప్పటికీ ఆయన జిల్లా స్థాయి వ్యవహారాలు చూస్తున్నాడేగాని కావలిపై దృష్టిపెట్టలేదు. అలాగని నిన్నటి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డితో స్థానిక తెలుగుదేశం కేడర్ అడ్జస్ట్ కావడం లేదు. మొత్తానికి బిఎంఆర్ చేరిక కావలి వైసిపికి అదనపు బలం కాగా, తెలుగుదేశంకు మాత్రం తీరని లోటే!

# చిత్తశుద్ధితో పనిచేస్తా...
# సమస్యలు పరిష్కరిస్తా!

➤ ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్ భూషణ్



జిల్లా ఎస్పీగా భాస్కర్ భూషణ్ ఈ నెల 8వ తేదీన నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో వేదపండితుల ఆశీస్సులతో బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరి డిజిపి కార్యాలయంలో వెయిటింగ్‌లో వున్న ఆయనను జిల్లా ఎస్పీగా నియమించడం, ఇక్కడ ఎస్పీగా వున్న ఐశ్వర్య రస్తోగిని మంగళగిరి డిజిపి కార్యాలయంలో ఏఐజికి పంపడం తెలిసిందే! కొత్త ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర భూషణ్‌ను, ఏఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్‌ఐలు మర్యాదపూర్వకంగా కలిసి తమ అభినందనలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ భాస్కరభూషణ్ మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుని వాటి పరిష్కారంపై దృష్టి పెడతానన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తాం, ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు చేరువవుతాం, సమర్థత, నిజాయితీతో కూడిన సేవలందించి వారి విశ్వాసాన్ని చూరగొంటామని ఆయన పేర్కొన్నారు. లైంగిక నేరాలను అరికడతాం, పిల్లలు, మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యతనిస్తాం. చోరీల నివారణపై ప్రత్యేకదృష్టి పెడతాం, నేరనియంత్రణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడుకుంటూ, అక్రమ రవాణాను, బెట్టింగ్ మాఫియాను పూర్తిగా అరికడతామని ఎస్పీ చెప్పారు. నెల్లూరు నగరంలో సంకటంగా వున్న ట్రాఫిక్ సమస్యను దారిలోకి తెస్తామని ఆయన అన్నారు. పోలీస్‌శాఖకు మూలస్థంభాలైన ఐపిసి, సిఆర్‌పిసి, ఎవిడెన్స్ యాక్ట్ అనే అంశాలకు కట్టుబడి పోలీసు యంత్రాంగం విధులు నిర్వహించాల్సి వుంటుందని ఆయన తెలిపారు. విధుల్లో ఎవరైనా అలసత్వం వహిస్తే సహించేది లేదని, తప్పకుండా అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్‌లకు వచ్చి బాధితులు ఇస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వారికి తగు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో పోలీసు సిబ్బంది సంక్షేమానికి తన పూర్తి సహాయసహకారాలు వుంటాయని ఆయన హామీ ఇచ్చారు.

# ఈసారి... బార్ల కోసం బారులు తీరలేదు!

### 29 బార్‌లకు 32 దరఖాస్తులే!

***గతంలో బార్ల లైసెన్స్‌లకు దరఖాస్తుదారులు బారులు తీరి నిలుచుని వుండేవాళ్ళు. అప్పుడు ఆదాయాలు అలా వుండేవి. ఇప్పుడు బార్ల లైసెన్స్‌లంటేనే భయపడిపోతున్నారు.***

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త ఎక్సైజ్ పాలసీలతో మద్యం వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. చంద్రబాబు హయాంలో మద్యం అమ్మకాలు మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా జరిగాయి. వైసిపి అధికారంలోకి వచ్చాక మద్యం వ్యాపారులకు వైయస్ జగన్మోహన్‌రెడ్డి చుక్కలు చూపిస్తున్నాడు. మద్యం నియంత్రణ కోసం ఏమేం చేయాలో అవన్నీ చేస్తున్నాడు. మద్యం అమ్మకాలను ప్రభుత్వం ఆధీనంలోకి తెచ్చారు. మద్యం దుకాణాలను తగ్గించేశారు. తాజాగా బార్లను కూడా 40శాతానికి తగ్గించాలని చెప్పి, గతంలో వున్న బార్ లైసెన్స్‌లను రద్దు చేశారు. కొత్తగా బార్ లైసెన్స్ ఫీజులను పూర్తిగా మార్చారు. లక్కీడిప్ ద్వారా బార్ లైసెన్స్‌లను కేటాయించాలని నిర్ణయించడం తెలిసిందే! అయితే బార్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసుకోవాలంటే దాని ఫీజే 10లక్షలుగా నిర్ణయించడంతో మద్యం వ్యాపారుల గుండెల్లో రాయిపడ్డట్లయ్యింది. లాటరీలో లైసెన్స్ రాకపోయినా ఈ దరఖాస్తు ఫీజు ఇక తిరిగి రాదు.

దీని ప్రభావం బార్ లైసెన్స్ దరఖాస్తులపైన బాగానే పడ్డట్లుంది. జిల్లాలో మొత్తం 29బార్ల లైసెన్స్‌ల కోసం దరఖాస్తులను ఆహ్వానించగా, వాటికి 32 దర



ఖాస్తులు మాత్రమే వచ్చాయి. నెల్లూరులో 20బార్లకు 20 దరఖాస్తులు, కావలిలో 4 బార్లకు 5 దరఖాస్తులు, గూడూరులో 2బార్లకు 2 దరఖాస్తులు, నాయుడుపేటలో ఒక్క బార్‌కు 3 దరఖాస్తులు, సూళ్లూరుపేట, ఆత్మకూరులలో ఒక్కో దానికి ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చాయి. కావలి, నాయుడుపేటలలో లైసెన్స్‌లకు మాత్రమే ఇప్పుడు లాటరీ తీయాల్సివుంటుంది.

పాత బార్ లైసెన్స్‌దారులు తమ లైసెన్స్‌లను రద్దు చేయడాన్ని నిరసిస్తూ కోర్టుకెక్కి వుండడం, మద్యం అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుండడం వంటి చర్యలతోనే మద్యం వ్యాపారులు ఈ లైసెన్స్‌ల కోసం పెద్దగా ఆసక్తి చూపలేదని తెలుస్తోంది.

# ఎన్‌కౌంటర్‌తో కూలైన ప్రసన్న



హైదరాబాద్ శివార్లలో జరిగిన 'దిశ' సంఘటనపై వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో ఎక్కువుగా స్పందించిన నాయకుడు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. మన ఇంట్లో ఆడబిడ్డకు అన్యాయం జరిగితే ఎలా స్పందిస్తామో, తన ఇంట్లో బిడ్డ కాకపోయినప్పటికీ 'దిశ' సంఘటన విషయంలో ఆయన మానవత్వంతో తీవ్రంగా స్పందించాడు. నిందితులను ఎన్‌కౌంటర్ చేయాలంటూ విలేకరుల సమావేశం పెట్టి మరీ ఆయన డిమాండ్ చేశాడు. వైసిపి మహిళా నాయకురాళ్ళు కూడా ఆయనంత ఆవేశంగా మాట్లాడలేదు. జరిగిన సంఘటన ఆయన మనసును ఎంతగా కదిలించిందో ఆయన మాటలను బట్టే అర్థమైంది.

'దిశ' నిందితులు ఎన్‌కౌంటర్‌లో చనిపోయారని తెలియగానే ఆయన సంతోషించాడు. నిందితులకు తగిన శాస్తి జరిగిందంటూ తెలంగాణ పోలీసులను ప్రెస్‌మీట్ పెట్టి మరీ అభినందించాడు.

# సరిహద్దుల్లో చెక్‌పోస్టులు

### ఇసుక అక్రమరవాణాకు చెక్ పెట్టిన అధికారులు

గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇసుక అక్రమరవాణా యదేచ్ఛగా సాగిన నేపథ్యంలో తమ పాలనలో అలాంటి అవకతవకలకు తావుండకూడదంటూ ఇసుక అక్రమరవాణా నిరోధానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో



జిల్లాలో అధికారులు ఆ మేరకు నిర్దిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. జాతీయ రహదారులపై సరిహద్దుల్లో తాజాగా చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. తడ మండలంలోని పెరియవట్టు సరిహద్దుల్లో ఒక చెక్‌పోస్టును, శ్రీసిటీ పరిసరాల్లో ఒక చెక్‌పోస్టును ఏర్పాటుచేసి, రెండు షిఫ్టుల్లోనూ సిబ్బంది విధులు నిర్వహించే విధంగా ఏర్పాటుచేశారు. శ్రీసిటీ వద్ద చెక్‌పోస్ట్‌లో ఒక ఎస్‌ఐ, ఒక హెడ్ కానిస్టేబుల్‌తో పాటు మైనింగ్‌శాఖకు చెందిన ఒక ఆర్‌ఐ విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా పెరియవట్టు వద్ద ఒక ఎస్‌ఐ, ఏఎస్‌ఐ తదితర సిబ్బంది విధుల్లో ఉన్నారు. గతంలో రోజుకు 50కిపైగానే లారీల్లో ఇసుక అక్రమరవాణా జరిగేది. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న మండలం కావడంతో తడలో ఇసుకలారీలు జోరుగా దూసుకుపోతుండేవి. కాళంగి నది, పాముల కాలువ, పులికాట్ సరస్సుల్లోని ఉప్పు ఇసుక, పొలాల్లోని దువ్వమట్టిని అంతా తమ ఇష్టానుసారం తవ్వేసి వాహనాల్లో నింపుకుని వెళ్ళేవారు. నదులు కాలువలన్నిటినీ తవ్వేసుకుని డబ్బు చేసుకునేవారు. తమకు అనుకూలమైన ప్రాంతాల్లో నిల్వ ఉంచుకుని సందు దొరికనప్పుడల్లా తమిళనాడుకు తీసుకువెళ్ళి అక్రమార్జన చేసుకునేవారు. ఇసుకపై రాష్ట్రప్రభుత్వం కొత్తపాలసీ తీసుకువచ్చి అమలు చేస్తుండడంతో అక్రమరవాణాకు కళ్ళెం వేసినట్లయింది. ఇసుక అక్రమరవాణాపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులంతా దృష్టి సారించి, ఈ అక్రమరవాణాను నిరోధించేందుకు గట్టి చర్యలు తీసుకుంటుండడంతో ఇప్పుడు ఈ ప్రాంతాల్లో ఇసుక లారీల ఊసే కనిపించడం లేదంటూ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# నెల్లూరులో ఉప సభాపతి



రాష్ట్ర శాసనసభ డిప్యూటి స్పీకర్ కోన రఘుపతి ఈ నెల 8వ తేదీన తిరుమలకు వెళుతూ మార్గమధ్యంలో నెల్లూరులోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో కొద్దిసేపు ఆగారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు, ఉన్నతాధికారులు, బ్రాహ్మణ సంఘాల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

# తమ్ముడికి.. అన్న అభినందన



ఆనం విజయను అభినందిస్తున్న రామనారాయణరెడ్డి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ఆనం విజయకుమార్‌రెడ్డి ఇటీవల నెల్లూరు, ఇస్కాన్‌సిటీలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశాడు. సహకార బ్యాంకు ద్వారా చేపట్టాల్సిన పనులపై వారు చర్చించారు.

అలాగే విజయకుమార్‌రెడ్డిని వెంకటగిరి శాసన సభ్యులు, ఆయన సోదరుడు ఆనం రామనారాయణరెడ్డి కూడా అభినందించారు.

## అపోలో ఆసుపత్రి ఉద్యోగికి

# అంబేద్కర్ సేవా పురస్కారం



పురస్కారాన్నందుకుంటున్న శివకుమార్

నెల్లూరులోని అపోలో ఆసుపత్రి ఉద్యోగి మద్దినేని నితిన్ శివకుమార్ అంబేద్కర్ సేవాపురస్కారాన్ని అందుకున్నాడు. ఈ నెల 10వ తేదీన నెల్లూరులోని ఆంధ్రసభ సమావేశ మందిరంలో ప్రపంచ మానవ హక్కుల సంఘం ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో సంఘం ఛైర్మెన్ ఎం.సుబ్బారెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ చైత్రవర్షిణి, అనంతపురం డిప్యూటి కలెక్టర్ మధుసూదన్‌రెడ్డి చేతులమీదుగా ఆయన ఈ అవార్డ్‌ను అందుకున్నాడు. వైద్యరంగంలో అందిస్తున్న సేవలకుగాను ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్న శివకుమార్‌ను అపోలో యాజమాన్యం, వైద్య సిబ్బంది అభినందించారు.

## వైద్య కళాశాల

# ప్రిన్సిపాల్‌గా రాజు

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా సైక్రియాటిక్ విభాగాధిపతిగా వున్న డాక్టర్ రాధాకృష్ణరాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో పెద్దాసుపత్రి సూపరింటెండెంట్‌గా కూడా పనిచేసి వున్నారు.

## మెప్మా పి.డి కి

# అదనపు బాధ్యత



రమేష్‌కుమార్

మెప్మా ప్రాజెక్ట్ డైరక్టర్ రమేష్‌కుమార్‌ను గూడూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ ప్రత్యేక అధికారిగా వ్యవహరించారు. ఆ బాధ్యతను ఇప్పుడు మెప్మా పి.డికి అప్పగించారు.

## శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ

# పునర్నిర్మాణం కోసమే..

### దేవస్థాన భూముల అమ్మకంపై ఆలయ బోర్డు ఛైర్మన్ మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి



ఆలయ అభివృద్ధి, పురర్నిర్మాణం కోసమే ఆలయ భూములు అమ్మాలని దేవదాయశాఖను అనుమతులు కోరామని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మన్నెం లక్ష్మీనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 7న దేవస్థానం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ గతంలో విక్రయించిన భూముల తాలూకు నగదు బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా ఉన్నాయని వాటిపైన వచ్చే వడ్డీ 13శాతం నుండి 6శాతానికి తగ్గిపోవడంతో దేవస్థానం ఆదాయం తగ్గిపోయిందన్నారు. బ్రహ్మోత్సవాల ఖర్చులు, ఇతర ఉత్సవాల ఖర్చులు భారీగా పెరిగిపోవడంతో అప్పుల్లోకి వెళ్ళామన్నారు. పురాతన దేవస్థానం కావడంతో పూర్తిగా దెబ్బతినిందని, దేవస్థానం అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని పర్యవేక్షణకు ఇవోను నియమించాలని కోరామన్నారు. నెల్లూరు నగరంలో దాదాపు 44 ఎకరాలు ఆలయ భూములు వున్నాయన్నారు. మాగుంట లేఅవుట్ వద్ద వున్న దాదాపు 10 ఎకరాల స్థలంలో కల్యాణ మండపాన్ని నిర్మించేందుకు ఆలోచిస్తున్నామన్నారు. దేవస్థానానికి సంబంధించి వున్న భూముల పరిరక్షణకు దేవస్థానం భూములని బోర్డులు ఏర్పాటు చేసామన్నారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ కార్యనిర్వహణాధికారి వేగూరు రవీంద్రరెడ్డి, వ్యవస్థాపక ధర్మకర్త మజ్జిగ చంద్రమౌళిరెడ్డి పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన

# ఎన్‌జిఓల కొత్త కార్యవర్గం



ఏపి ఎన్‌జిఓ అసోసియేషన్ జిల్లా కొత్త కార్యవర్గ బృందం సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరి బాబును ఆయన క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా వారు ఎన్‌జిఓల పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విఆర్‌సి శేఖర్‌రావు, కార్యదర్శి ఎన్.ఆంజనేయులు, అసోసియేట్ అధ్యక్షుడు నాగిశెట్టి గిరిధర్, ఉపాధ్యక్షులు రమేష్‌బాబు, కరుణమ్మ, మాధవయ్య, ఎన్.మధు, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.పెంచలయ్య, సంయుక్త కార్యదర్శులు విజయకుమార్, రామకృష్ణ, చంద్రశేఖర్, నగర కార్యదర్శి చిలకా రామకృష్ణారెడ్డి, డిఇసి చెంచయ్య, మహిళా విభాగం ఛైర్‌పర్సన్ స్వర్ణలత వున్నారు.

## నెల్లూరు కబుర్లు



రైతుబజార్‌లో ఉల్లి కోసం బారులుతీరిన జనం

## ఆల్‌టైం రికార్డుగా...

# ఎర్రగడ్డల ధరలు

### ➢ కిలో 200 రూపాయలు

బహిరంగ మార్కెట్‌లో ఎర్రగడ్డల ధరలు కిలో 200 రూపాయల మైలురాయిని తాకాయి. వన్డేల్లో రోహిత్‌శర్మ డబుల్ సెంచరీ చేసినంత వేగంగా వీటి ధరలు పెరగడం విశేషం. దిగుబడులు వచ్చేవరకు ఈ ఎర్రగడ్డల ధరలు దిగొచ్చే పరిస్థితి లేదు. అదికూడా సన్న గడ్డలైతే కిలో 200 రూపాయలు, పెద్ద గడ్డలైతే 220 రూపాయలుగా వుంటున్నాయి. పెరిగిన ధరల దెబ్బకు ఇళ్లల్లో ఇప్పుడిప్పుడే ఎర్రగడ్డల వాడకం తగ్గించేస్తున్నారు. వాటి బదులు ప్రత్యామ్నాయ వస్తువులు వాడుతున్నారు. ఆనియన్ పకోడ బదులు క్యాబేజీ పకోడా వేస్తున్నారు. కొద్దిరోజులు ఎర్రగడ్డల వాడకం మానేస్తే, బ్లాక్ మార్కెట్‌లో వుండేవి బయట కొస్తాయని, అప్పుడు ధరలు తగ్గుతాయని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అందరూ ఒక నెలరోజులు ఎర్రగడ్డల వాడకం ఆపేస్తే చచ్చినట్లు ధరలు దిగొస్తాయి.

ఇక రాష్ట్ర ప్రభుత్వమేమో రైతు బజార్‌ల ద్వారా కిలో 25రూపాయలకే ఎర్రగడ్డలు అందించే ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తోంది. దీంతో సంవత్సరం పొడవునా కళావిహీనంగా కనిపించే రైతుబజార్లు ఇప్పుడు ఎర్రగడ్డల కోసం కిలోమీటరు పైన బారులు తీరిన జనాలతో కళకళలాడుతున్నాయి.

# సీఎం మాట తప్పారు..

### - కోటంరెడ్డి శీనయ్య



ఆర్టీసీ చార్జీలు పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి మాట తప్పారని నుడా మాజీఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి విమర్శించారు. ఈనెల 8న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ మాట తప్పం, మడం తిప్పం అన్న సీఎం ఆర్టీసీ చార్జీలు పెంచి ప్రజలపై ఏడాదికి రూ.700 కోట్లు భారం మోపడం మాట తప్పడం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదాపై ఒక్క మాట కూడా మాట్లాడడం లేదని, సామాన్యులు ఢిల్లీకి వెళ్ళి ప్రధానిని కలిసి వస్తుంటే ముఖ్యమంత్రికి అపాయింట్‌మెంట్ కూడా దొరకడం లేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పరిపాలనను చూసి జగన్ కాపీ కొడుతున్నారని, ఇలా అయితే డీబార్ కావడం ఖాయమన్నారు. ప్రజలకు అలివికాని హామీలు ఇచ్చి ప్రభుత్వ స్థలాలు అమ్మే పరిస్థితికి తీసుకొచ్చారన్నారు. ఆరు నెలల్లో మంచి పాలన చూపిస్తామని మర్డర్లు, ఇసుక మాఫియా, దోపిడీలు, కొట్లాటలు చూపించారన్నారు. ఆటో డ్రైవర్లు కొందరికి మాత్రమే రూ.10 వేలు ఇచ్చి జరిమానాల పేరుతో రూ.14 వేలు వసూలు చేశారని విమర్శించారు. టీడీపీ నాయకులు ఉచ్చి భువనేశ్వర ప్రసాద్, ఖాజావలి, జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీకి తొలి 'స్పందన'



ఆదివారం జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భాస్కరభూషణ్ సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో పాల్గొన్నాడు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన 'స్పందన' కార్యక్రమంలో ఆయన తొలిసారిగా పాల్గొని బాధితుల సమస్యలను విన్నాడు. దాదాపు వందకు పైగా ఫిర్యాదులు రాగా వాటన్నింటిని పరిష్కరించి సత్వర న్యాయం అందించాలంటూ ఆయా స్టేషన్‌ల అధికారులు, సిబ్బందికి సూచించాడు.

# ఈ బాదుడేంటి?

### - బీజేపీ ధర్నా



ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేస్తున్నామని చెప్పి, ఆర్టీసీ ఛార్జీలను పెంచి సామాన్య ప్రయాణీకులను చావగొట్టడమేంటని బీజేపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ నెల్లూరుజిల్లా శాఖ ఆధ్వర్యంలో 9వ తేదీ ఆర్టీసీ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ విలీనంతో వచ్చే నష్టాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చెప్పిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, ఇప్పుడు మాటమార్చి ప్రజలపై భారం మోపడం భావ్యం కాదన్నారు. అసలే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు సతమతమవుతుంటే, మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లుగా ఈ ఛార్జీలు పెంచడమేంటని ప్రశ్నించారు. ఈ ధర్నాలో బీజేపీ నాయకులు ఎ.ఈశ్వరయ్య, కరణం భాస్కర్, మిడతల రమేష్, ఎం.శ్రీనివాసులుగౌడ్, కాయల మధు తదితరులు పాల్గొన్నారు.

## యంసిఏ సెమిష్టర్ ఫలితాల్లో

# కృష్ణచైతన్య ప్రతిభ



విక్రమ సింహపురి యూనివర్శిటి విడుదల చేసిన యంసిఏ సెమిష్టర్ ఫలితాల్లో కృష్ణచైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజి కళాశాలకు చెందిన విద్యార్థులు మొదటి స్థానంతో పాటు వరుసగా 10 స్థానాలు సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు డా. ఆర్‌వి కృష్ణారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వియస్ యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆర్ సుదర్శనరావు విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. కృష్ణచైతన్య కళాశాలకు చెందిన యంసిఏ విద్యార్థులు మొదటి పది ర్యాంకులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని, అధ్యాపకులను అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్స్ యు.మల్లిఖార్జునయ్య, టి.జ్యోతి, కె.సుబ్బారావు, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



# సీయస్‌తో అధికారుల భేటి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఈ నెల 7వ తేదీన తిరుమల శ్రీవారి దర్శనార్థం వెళుతూ నాయుడుపేట ఆర్ & బి గెస్ట్‌హౌస్‌లో కొంతసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఆమె వస్తుందన్న సమాచారం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, గూడూరు సబ్‌కలెక్టర్ గోపాలకృష్ణ, గూడూరు డిఎస్పీ భవాని హర్ష తదితరులు ముందుగానే అతిథిగృహం వద్దకు చేరుకున్నారు. సియస్‌కు ఘనస్వాగతం పలికి ఆమెతో కొంతసేపు సమావేశమై జిల్లాలోని పరిస్థితులపై చర్చించారు.

## 'దేశం'తోనే

# నా బతుకు, భవిష్యత్

**- బీద రవిచంద్ర**



మాజీ శాసనసభ్యులు బీద మస్తాన్ రావు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరిన నేపథ్యంలో ఆయన సోదరుడైన బీద రవిచంద్ర రాజకీయ భవిష్యత్‌పై చర్చ మొదలైంది. ఆయన తెలుగుదేశంలోనే వుంటాడా? లేక వైసిపిలో చేరతాడా? అనే ఊహాగానాలు తలెత్తాయి. వీటన్నింటికి తెరదించుతూ తాను తెలుగుదేశంలోనే వుండబోతున్నానని, తన బ్రతుకు భవిష్యత్ అంతా కూడా ఆ పార్టీతోనేనని స్పష్టం చేశాడు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర.

9వ తేదీ నెల్లూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంట్లో ఊపిరి వున్నంతవరకు, చివరి మజిలీ వరకు తెలుగుదేశంలోనే ఉంటానని, రాజకీయాలు వదలాల్సి వస్తే ఇంట్లో కూర్చుంటానేగాని ఇంకో పార్టీలో చేరే ప్రసక్తేలేదని స్పష్టం చేశాడు. బీద మస్తాన్ రావు వైసిపిలో చేరడం ఆయన వ్యక్తిగత వ్యవ హారంగా పేర్కొన్నాడు. 30ఏళ్లగా మస్తాన్‌రావు, నేను తెలుగుదేశంలో వున్నాం. పార్టీ మమ్మల్నెంతగానో గౌరవించింది. ఎన్నో బాధ్యతలు అప్పగించింది. మాకు వచ్చిన అవకాశాలతో అల్లూరు, కావలి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశామని అన్నాడు. వ్యాపారాలను కాపాడుకోవడం కోసమే బీద మస్తాన్‌రావు వైసిపిలో చేరా డన్న ఆరోపణలను ఆయన ఖండించాడు. వ్యాపా రాలకు, రాజకీయాలకు ఎటువంటి సంబంధం లేదని చెప్పుకొచ్చాడు.



# డిజిపిని కలిసిన రామ్

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తిరుపతి, బాపట్ల లోక్‌సభ నియోజకవర్గాల సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి 9వతేదీ మంగళగిరిలోని రాష్ట్ర పోలీస్‌శాఖ కార్యాలయంలో డిజిపి గౌతమ్‌సవాంగ్‌ను కలిశాడు. వాకాడులో పోలీసు సర్కిల్ కార్యాలయం నిర్మాణంపై ఆయన డిజిపితో చర్చించాడు.

# ఆంగ్లవిద్యపై విమర్శలు అర్ధరహితం

## జగన్ సక్సెస్‌ఫుల్ సీఎం - 'నాటా' అధ్యక్షుడు రాఘవరెడ్డి



ఇంగ్లీష్‌మీడియంపై లేనిపోని రాద్ధాంతం అర్ధరహితమని, కొన్ని రాజకీయపార్టీలు పని గట్టుకుని ముఖ్యమంత్రి జగన్‌పై విమర్శలు చేయడం మంచిదికాదని అమెరికన్ తెలుగు అసోసియేషన్ (నాటా) అధ్యక్షుడు, అమెరికాలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఫౌండేషన్ ట్రస్టు నిర్వాహకుడు రాఘవరెడ్డి అన్నారు.

ఈనెల 6న ఆయన జిల్లాలోని తన స్వగ్రామమైన ఏఎస్‌పేట మండలంలోని కొండ మీద కొండూరు గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఇంగ్లీష్ బాగా చదువుకున్నవారికే మంచి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. కొంతమంది నాయకులు కూడా ఇంగ్లీష్ విద్యపై విమర్శలు చేస్తున్నారని, చదువురాని వాళ్ళు రాజకీయాల్లో ఉంటే ఇలాగే ఉంటుందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పాలన అద్భుతమని ఆయన అంటూ జగన్ సక్సెస్‌ఫుల్ ముఖ్యమంత్రి అని కొనియాడారు. వైఎస్ఆర్ హయాంలో ఎంతోమంది పేదలు ఆరోగ్యశ్రీ పథకంతో లబ్ధిపొందారని, అదే తరహాలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా 'నాటా' ఆధ్వర్యంలో ఇప్పటికీ వైఎస్సార్ ఫౌండేషన్ ద్వారా 125 వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్‌రెడ్డి పదవినధిష్టించిన కేవలం 6నెలల కాలంలోనే ఎన్నో ప్రజోపయోగకరమైన పథకాలను ప్రవేశపెట్టి ప్రజల ఆదరణ పొందుతున్నారన్నారు. కొద్దినెలల క్రితం జగన్ అమెరికా వచ్చినప్పుడు తెలుగువాళ్ళతో ఎంతో ఆత్మీయంగా మాట్లాడారని, రాష్ట్రంలోని మారుమూల గ్రామాలను సైతం అభివృద్ధిలోకి తెస్తామని చెప్పారని అన్నారు. ఆయన వెంట వైకాపా నాయకులు శ్రీనివాసులురెడ్డి తదితరులున్నారు.

## మీ పార్టీ ఎమ్మెల్యేనే

# సూటిగా చెప్పాడు

**- ఆనం వెంకటరమణారెడ్డి**



నెల్లూరు మాఫియాకు కేంద్రంగా మారి పోయిందని, ఇటీవల మీ పార్టీ వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి చెప్పింది అక్షరాల నిజమని, తాము కూడా ఆరునెలల నుండి అదే చెబుతున్నామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి అన్నాడు. ఈనెల 8న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరులో ఇసుక, లిక్కర్, ల్యాండ్ మాఫియాతో పాటు క్రికెట్ బెట్టింగ్ సాగుతోందని అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల టన్నుల ఇసుకను అందించామని చెబుతున్నా 20శాతం కూడా ప్రజలకు అందలేదన్నారు. సాక్ష్యాలతో సహా జిల్లా కలెక్టర్, ఎస్పీకి తాము ఫిర్యాదు చేశామన్నారు. నెల్లూరులో ఏ చిన్న లేఅవుట్ వేయాలన్నా నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేల కార్యాలయాల నుంచి చీటీలు రాకపోతే అనుమతులు ఇవ్వడం లేదన్నారు. జిల్లాలో ఇరిగేషన్ మాఫియా కూడా సాగుతోందన్నారు. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ వీటిపై దృష్టి సారించాలన్నారు. టీడీపీ నాయకులు ఆసిఫ్ బాషా, మనుబోలు సికిందర్‌రెడ్డి, రాజుపాలెం శీను, మేకల రామ్మూర్తి, వి.రమేష్‌నాయుడు, ఆర్‌కేటీ రాజా, యు.సురేంద్రబాబు, జి.రవి, మల్లిఖార్జునరెడ్డి పాల్గొన్నారు.

# వంతెన పూర్తయితేనే.. వెతలు తీరేది!

నెల్లూరురూరల్ పరిధిలోని పొట్టేపాలెం సమీపంలో నెల్లూరు చెరువు కలుజు వద్ద వాహనదారులకు సినిమా కనిపిస్తోంది. ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి గుడి నుండి దొడ్ల డెయిరీ దాకా ఈ రోడ్డును నాలుగులైన్లుగా అభివృద్ధి చేసినప్పటికీ ఈ కలుజు వద్ద మాత్రం రోడ్డును అలాగే వదిలేశారు. అదీగాక ఈ కలుజు పాడైపోయింది. వర్షాకాలంలో ఇక్కడ నీళ్ళు పారుతుంటాయి. మిగతా కాలాలలో పొట్టేపాలెం ఇసుక రీచ్ నుండి వచ్చే ఇసుక వాహనాల మూలంగా ఇక్కడంతా ఇసుక పేరుకుపోతోంది. ఈ ప్రాంతంలో రోడ్డు మలుపు కూడా ప్రమాదకరంగా వుంది. కలుజుకు కొంచెం దూరంలో మలుపు లేకుండా రహదారిని నేరుగా వుండేలా చేస్తూ వంతెన డిజైన్ చేసి వున్నారు. 7కోట్లతో ఈ వంతెన నిర్మాణాన్ని త్వరలోనే చేపడతామని ప్రజాప్రతినిధులు సెలవిచ్చారు. దానిని త్వరగా పూర్తిచేస్తే నెల్లూరురూరల్ గ్రామాలకు వెళ్లే వాహన చోదకుల కష్టాలు తీరుతాయి.

# మహిళల రక్షణే.. ప్రభుత్వ లక్ష్యం

వృద్ధులు, మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలను నియంత్రించి వారికి పూర్తి స్థాయిలో రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా గ్రామ, వార్డు సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శులను నియమించినట్లు జిల్లా కలెక్టర్ యంవి శేషగిరిబాబు పేర్కొన్నారు. ఈనెల 9న వెముదుగుంటలోని జిల్లా పోలీసు శిక్షణా కళాశాలలో రెండు వారాల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించాడు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మాదక ద్రవ్యాలు, మద్యం అక్రమ నిల్వలు, విక్రయాల నియంత్రణలో పటిష్టమైన పాత్ర పోషించాలన్నారు.

ఎస్పీ భాస్కర్ భూషణ్ మాట్లాడుతూ రెండేళ్ళ పోలీసు శిక్షణను రెండు వారాలకు కుదించి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా శాంతి భద్రతలు, మహిళలపై గృహ హింస, లైంగిక వేధింపులు, దాడులు తదితర నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టి రక్షణ, భద్రత కల్పించాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్, ఏఎస్పీ క్రైమ్స్ పి.మనోహర్‌రావు మాట్లాడుతూ



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఎస్పీ భాస్కర్

జిల్లాలో 924 మంది గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులుగా నియమితులయ్యారని తెలిపారు. వారిని బ్యాచ్‌కు 132 మంది చొప్పున ఏడు బ్యాచ్‌లుగా విభజించామన్నారు. తొలి బ్యాచ్‌కు చెందిన 132 మందిని ఆహ్వానించగా 118 మంది శిక్షణకు హాజరయ్యారన్నారు. శిక్షణా కేంద్రంలో అన్ని వసతులు కల్పించ డంతో పాటు బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. నగరపాలక సంస్థ కమిషనర్ పీవీవీయస్ మూర్తి, మహిళా శిశు సంక్షేమ శాఖ ఏపీడీ శేషకుమారి, ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుడు, నెల్లూరు రూరల్, ఏఆర్ డీఎస్పీలు, ఎస్బీ, సీసీయస్, దర్గామిట్ట, రూరల్ సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.




# సెంట్రల్ జైలుకెళ్లిన ఎస్పీ



జిల్లా ఎస్పీ భాస్కర్ భూషణ్ 9వ తేదీ నెల్లూరు, చెముడుగుంటలోని కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.ఆర్.రవికిరణ్ జైలు ప్రాంగణంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను ఎస్పీకి వివరించారు. ఖైదీల చేత వ్యవసాయ క్షేత్రంలో కూరగాయలు, ఆకుకూరలు పండించి బయట మార్కెట్‌లో అమ్ముతున్నామని, వారిచేత షాంపులు, టూత్‌పేస్ట్, ఆయిల్స్, క్లీనింగ్ లోషన్స్, స్టీల్ ఫర్నీచర్, బట్టలు తయారు చేయిస్తూ వాటిని బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నామని తెలిపారు. జైలు నిర్వహణ బాగా వుందంటూ ఎస్పీ మెచ్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్.బి డిఎస్పీ కోటారెడ్డి, నెల్లూరురూరల్ డిఎస్పీ కె.వి.రాఘవరెడ్డి, రూరల్ సిఐ కె.రామకృష్ణ, వెంకటాచలం ఎస్ఐ కరీముల్లా వున్నారు.

# ఇస్కాన్‌లో గీతా జయంతి వేడుకలు



రథయాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ వినోద్‌కుమార్

నెల్లూరు ఇస్కాన్ సిటీలోని ఇస్కాన్ మందిరంలో ఈనెల 8న గీతా జయంతి మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షుడు శుకదేవస్వామి భగవద్గీత విశిష్టతను గురించి వివరించారు. గీతా పారాయణం ద్వారా సకల శుభాలు చేకూరతాయని, ప్రేమ, సేవ, ఆనందం పంచగలిగే శక్తి గీతా పారాయణం ద్వారా లభిస్తుందన్నారు. మందిరంలోని శ్రీకృష్ణ బలదేవ సుభద్రలకు ప్రత్యేక అలంకారంలో పూజలు, హారతులు సమర్పించారు. నెల్లూరు జాయింట్ కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదలను స్వీకరించారు. 2020 జనవరి 29న నెల్లూరులో జరిగే జగన్నాథ రథయాత్ర పోస్టర్‌ను మందిర అధ్యక్షులతో కలిసి జేసీ ఆవిష్కరించారు.

# హోంగార్డుల సేవలు అభినందనీయం

## - ఏఆర్ ఏఎస్పీ వీరభద్రుని ప్రశంస



జిల్లాలో పోలీసులతో సమానంగా హోంగార్డులు ప్రజలకు తమవంతు సేవలందిస్తుండడం ఎంతో అభినందనీయమని ఏఆర్ ఏఎస్పీ ఎస్.వీరభద్రుడు ప్రశంసించారు. 57వ హోంగార్డ్స్ రైజింగ్ డే సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో హోంగార్డులు అందించే సేవలు నిరుపమానమైనవని కొనియాడారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లోనూ, రొట్టెల పండుగ, వెంకటగిరి జాతర తదితర కార్యక్రమాల్లో బందోబస్తులో ఉన్న హోంగార్డులు సమర్ధవంతంగా విధులు నిర్వహించారన్నారు. హోంగార్డ్స్ డిఎస్పీ డి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి హోంగార్డుల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని, అందులో భాగంగా వేతనాన్ని పెంచారని అన్నారు. యాక్సెస్‌బ్యాంక్ ద్వారా జీరో బ్యాలెన్స్ అకౌంట్ ప్రారంభించి 30 లక్షల బీమా సదుపాయం, పోలీసు ఆసుపత్రిలో ఉచిత వైద్య సదుపాయం, సబ్సిడీ క్యాంటీన్‌లో స్మార్ట్‌కార్డ్, వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో 5 లక్షల వరకు కార్పొరేట్ వైద్యసౌకర్యం తదితర సంక్షేమపథకాలు అమలుచేస్తున్నారన్నారు. అనంతరం ఏఎస్పీ హోంగార్డులతో ర్యాలీని ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో డిఎస్పీలు ఎన్.కోటారెడ్డి, జె.శ్రీనివాసులురెడ్డి, కెవి రాఘవరెడ్డి, పి.మల్లికార్జునరావు, రవీంద్రరెడ్డి, నగర ఇన్‌స్పెక్టర్లు వేమారెడ్డి, నాగేశ్వరమ్మ, టివి సుబ్బారావు, వైవి సోమయ్య, హోంగార్డ్స్ ఆర్ఐలు వెంకటరమణయ్య, మౌలాలుద్దీన్, చంద్రమోహన్, ఎంటిఓ గోపీనాథ్, హోంగార్డ్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

# స్త్రీల రక్షణకు ప్రత్యేక చట్టాలు అవసరం

## - డాక్టర్ రోహిణి



మాట్లాడుతున్న డాక్టర్ సి.రోహిణి, చర్చా వేదికలో పాల్గొన్న విద్యార్థినులు

నేటిసమాజంలో స్త్రీలపై జరుగుతున్న అఘాయిత్యాలను నిరోధించేందుకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాల్సిన అవసరం ఉందని గూడూరులోని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి అన్నారు. ఈనెల 10న గూడూరు పట్టణంలోని పురమందిరంలో మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో 'మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలు' అనే అంశంపై జరిగిన చర్చావేదికలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ప్రతివ్యక్తి సమాజంలో మంచి పౌరులుగా జీవించాలంటే అందుకు తల్లిదండ్రులు ప్రధానపాత్ర పోషించాలన్నారు. స్త్రీల రక్షణకు ప్రభుత్వం చేపట్టిన 100, 112 టోల్ నంబర్లపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థినులు కరాటే వంటి స్వీయరక్షణ విద్యలు నేర్చుకుంటే ఆపద సమయాల్లో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, పట్టణ ప్రముఖులు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ వ్యవస్థలో మార్పులు రావాలని, అప్పుడే మహిళలపై అరాచకాలు సమసిపోతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి. జనార్దన్‌రెడ్డి, కోట సునీల్‌కుమార్, కెఆర్ రెడ్డి, భాస్కరరావు, విజయకళ, రమణ బాబు, అశోక్ చక్రవర్తి, చెంచురామయ్య, వాసుగౌడ్, టి.మునిరాజా, దశరథరామి రెడ్డి, కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్ వార్తలు

## గూడూరు రైల్వే జంక్షన్‌లో

# వసతులు ఏర్పాటు చేయాలి



రైల్వే జిఎంని సత్కరిస్తున్న శ్యాంయాదవ్

గూడూరు రైల్వే జంక్షన్‌లో ప్రయాణీకులకు మెరుగైన వసతులు ఏర్పాటు చేయాలని దక్షిణమధ్య రైల్వే జిఎం గజానన్ మాల్యాని కలసి విన్నవించినట్లు గుంతకల్ రైల్వే డివిజన్ డిఆర్‌యుసిసి సభ్యుడు బి.మయూరి శ్యాం యాదవ్ తెలిపారు. ఈనెల 10న ఆయన తిరుపతి రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా అధికారులకు ఇక్కడి సమస్యలను వివరించినట్లు చెప్పారు. గూడూరు నుంచి విజయవాడ, తిరుపతి, చెన్నై ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు రిటర్న్ టికెట్‌ను గూడూరు రైల్వేస్టేషన్‌లో తీసుకునే సదుపాయాన్ని, నూతనంగా నిర్మించిన 4, 5వ ప్లాట్‌ఫాంలపై డిజిటల్ బోర్డులు ఏర్పాటుతో పాటు ఎస్కులేటర్ సౌకర్యాన్ని కూడా కల్పించాలని కోరినట్లు తెలిపారు.

# సర్వే నమోదుపై సమీక్ష

## - ఎంపిడిఓ నాగమణి



గూడూరులోని ఎంపిడిఓ కార్యాలయంలో ఈనెల9న ఆన్‌లైన్ డేటా సర్వే నమోదు ప్రక్రియపై ఎంపిడిఓ నాగమణి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుదూ సచివాలయాల పరిధిలో ఆన్‌లైన్‌లో సర్వే వివరాలు నమోదు కాని కుటుంబాల వారు ఆయా పంచాయతీ కార్యదర్శులకు వివరాలను అందజేసి నమోదు చేయించుకోవాలని సూచించారు. వలంటీర్లు సకాలంలో అందుబాటులో లేని కారణంగా సర్వేలో నమోదు కాని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొన్నారు.

## బలిజ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో

# గుడ్డ సంచులు పంపిణీ



గూడూరులోని బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల8న స్థానిక పూలతోట గిరిజన కాలనీలోని ప్రజలకు గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ పట్ల అవగాహన కలిగివుండాలని, ప్లాస్టిక్ బ్యాగ్‌ల వినియోగం వద్దని చెప్పారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించేవారిపై, వాటిని విక్రయించే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్లాస్టిక్ కవర్ల తయారీ కేంద్రాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం మానివేసినప్పుడే పర్యావరణ పరిరక్షణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి మునిరాజా, ఎం.వి రమణయ్య, సారంగం శ్రీనివాసులు, సనిశెట్టి వెంకటేశ్వర్లు, భాస్కర్, దయాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణులకు జేవివి పోషకాహార ప్యాకెట్లు



గూడూరులో జేవివి ఆధ్వర్యంలో ఈనెల 9న గర్భిణులకు పోషకాహార ప్యాకెట్లను అందజేశారు. స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో గూడూరు మునిసిపల్ కమిషనర్ ఓబులేశు, జేవివి అధ్యక్షుడు రాజా పాల్గొని ఆ ప్యాకెట్లను గర్భిణులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ స్థానిక ఆసుపత్రిని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వసతులపై ఆరా తీశారు. మరుగుదొడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని అక్కడి వైద్యులు చెప్పడంతో వాటిని పరిశీలించి మునిసిపల్ నిధులతో మరమ్మతులు చేయిస్తామన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమ, వైద్యులు రాజా, రామకృష్ణ, జేవివి ప్రతినిధులు రాజేంద్రప్రసాద్, చెంచు నారాయణ, మహీధర్, మదీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో హనుమద్వ్రత పూజలు

గూడూరు 2వ పట్టణంలోని మాలవ్యానగర్‌లో ఉన్న శ్రీరామరక్ష కుటీరంలో ఈనెల 10న హనుమద్వ్రతం వేడుకగా నిర్వహించారు. నిర్వాహకుడు చిట్టిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా ఉదయం స్వామివారికి శోభాయమానంగా ప్రత్యేక అలంకారాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# వైద్యవృత్తిని దైవ సమానంగా భావించాలి

వైద్య శాఖలో ఒకరిద్దరు అధికారులు చేసే తప్పిదాలకు శాఖ మొత్తానికి చెడ్డ పేరు వస్తుందని, అందువల్ల ఉద్యోగులు వైద్య వృత్తిని దైవ సమానంగా భావించి సేవలు అందించి వైద్య ఆరోగ్యశాఖకు మంచి పేరు తీసుకు రావాలని ఏపి హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు అన్నారు. ఈనెల 9న అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు నెల్లూరు గాంధీనగర్‌లో అవినీతికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చిత్తశుద్ధితో సేవలు అందిస్తామని వారు పేర్కొన్నారు. జిల్లా పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ మంజుల, జిల్లా కమ్యూనిటీ మొబైలైజేషన్ అధికారి సునీత, ఉద్యోగులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# క్షయ ఆసుపత్రిలో స్వచ్ఛభారత్

జిల్లా క్షయ నియంత్రణ కార్యాలయంలో ఈనెల 6న వైద్యులు, సిబ్బంది అందరూ కలసి స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. వైద్యాధికారి డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆవరణంలోని పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. పచ్చదనం.. పరిశుభ్రత వల్ల అనేక రకాల వ్యాధులను నియంత్రించుకోవచ్చన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణంలో వేప, కానుగ తదితర మొక్కలు నాటారు.

# జనవరిలో పక్షుల పండుగ

## - ఏర్పాట్లు సిద్ధం చేయాలన్న కలెక్టర్



జిల్లాలో ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ)ను వచ్చే జనవరి మొదటివారంలో నిర్వహిస్తామని, అందుకు తగ్గ ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 6న ఆయన పక్షుల పండుగ ఏర్పాట్లకు సంబంధించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పక్షుల పండుగను రాష్ట్రపండుగగా ప్రభుత్వం ప్రకటించినందున ఈ పండుగ ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఈ ఉత్సవాలకు జిల్లా నోడల్ అధికారిగా జేసీ-2 కమలకుమారి, సమన్వయ అధికారిగా వన్యమృగ సంరక్షణ డిఎఫ్ఓ హిమశైలజ వ్యవహరిస్తారన్నారు. ప్రోటోకాల్ ఏర్పాట్లను సూడా వైస్‌ఛైర్మెన్ బాపిరెడ్డికి, నాయుడుపేట ఆర్డీఓ సరోజకు అప్పగించామన్నారు. సూళ్ళూరుపేట జూనియర్ కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసే ప్రదర్శనశాలలు ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాలు అర్థమయ్యేవిధంగా ఏర్పాటుచేయాలన్నారు. వివిధ రకాల పక్షుల వివరాలను, విద్యార్థులకు విజ్ఞానం పెంపొందించే విధంగా పొందుపరచాలన్నారు. సందర్శకులకు తాగునీటి కొరత లేకుండా చూడాలని, బివిపాళెంలో పడవ షికారు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బ్యారికేడ్లు, లైఫ్‌జాకెట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లా సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా పాఠశాలల విద్యార్థులు, స్థానిక కళాకారులతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేయాలన్నారు. ఎక్కడా చెత్తచెదారం లేకుండా ఈ పండుగ జరిగే ప్రదేశాలన్నీ శుభ్రంగా ఉండాలని, ఎప్పటికప్పుడు చెత్తను తొలగిస్తుండాలని అన్నారు. పక్షుల పండుగకు వచ్చేవారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. సందర్శకులకు వివరాలను తెలియజేసేవిధంగా హెల్ప్‌డెస్క్, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, అటవీశాఖల అధికారులతో కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటుచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ-2 కమలకుమారి, డిఇఓ జనార్ధనాచార్యులు, డ్వామా పి.డి జ్యోతిబసు, డిఆర్‌డిఏ పి.డి శీనానాయక్, జిల్లా పర్యాటకశాఖ అధికారి శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

శీను గల్పిక

# అక్రమార్కులను హడలెత్తించిన 'బెత్తం బాషా'

అది ఢిల్లీలోని లలితకళా భవన్. సుప్రీంకోర్టు, ఆయా రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు, న్యాయవాదులు, డిజిపిలు, హోంమంత్రులు, సైబరాబాద్ కమిషనర్ వి.సి.సజ్జనార్... ఇలా ఎంతో మంది న్యాయ, చట్ట నిపుణులు హాజరై వున్నారు. అప్పుడే వేదిక మీదకు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ ఎక్కాడు. మైకు వద్దకొచ్చి స్పీచ్ మొదలుపెట్టాడు. రేప్‌లు, హత్యలు చేసినోళ్లకు మీరు ఉరిశిక్షలు, ఎన్‌కౌంటర్‌లు వంటివి చేయొద్దు... అలాంటివాళ్ళను రెండు బెత్తందెబ్బలు కొట్టండి, వెయ్యి కోట్ల కుంభకోణం చేసిన నాయకులచేత పాతిక గుంజీలు తీయించాలి... మర్డర్ చేసిన వాడి చేత గ్రౌండ్‌లో పదిరౌండ్లు కొట్టించాలి... భూకబ్జాలు, దొమ్మీలు చేసిన వారిచేత గోడకుర్చీ వేయించాలి, ఒకసారి రేప్ చేస్తే ఒక బెత్తం దెబ్బ, రెండుసార్లు రేప్ చేసి నోడికి రెండు బెత్తం దెబ్బలు శిక్షగా కొట్టాలి. దారి కాచి దోపిడీలు చేసే వారిని లాగి చెంప మీద ఒకటి కొట్టాలి. అవినీతికి పాల్పడే వారి చేతులపై నాలుగు బెత్తం దెబ్బలు వేయాలి. ఈ శిక్షలన్నీ 'బెత్తం పురాణం'లో గరుడ మహర్షి స్పష్టంగా చెప్పివున్నారు. ఆ పుస్తకాలన్నీ కూడా నా బుక్స్ గోడౌన్‌లో వున్నాయి. మీ అందరికీ కూడా పంపిస్తాను. అవి చదివి శిక్షలు అమలు చేయండంటూ అక్కడ నుండి కదిలాడు.

★★★★★

అది హైటెక్‌రత్న చంద్రబాబు నాయుడు ఇటుక, ఇసుక పేర్చి మధ్యలో సిమెంట్ కూర్చి, ఎంతో శ్రమకోర్చి కట్టించిన భాగ్యనగరం. అందులో జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ నివాసం. దానిపక్కనే 2ఎకరాల సువిశాల స్థలంలో ఆయన చదివిన 2లక్షల పుస్తకాలను దాచడానికి కట్టిన గోడౌన్. రాత్రి 9గంటల సమయంలో పవన్ ఆ గోడౌన్ లోకి వెళ్లాడు. నెం.19 బుక్స్ బ్లాక్‌లో ఓ పుస్తకం తీశాడు. దాని మీద 'బెత్తం పురాణం' అని వ్రాసి వుంది. అట్టమీద ఒక వ్యక్తి బెత్తంతో చిన్న పిల్లోడి చేతి మీద కొడుతున్నట్టు బొమ్మ కూడా వుంది. పవన్ ఆ పుస్తకం తీసుకుని ఇంట్లోకి వచ్చాడు. బెడ్‌రూంలో మంచంపై పడుకుని నడుం వాల్చాడు. భార్య అన్నా లెజ్‌నేవా వచ్చి పక్కన కూర్చుంది. పవన్ ఆమెతో.... నువ్వు పడుకుని నిద్రపో, నేను రెండు లక్షల ఒకటవ పుస్తకం చదవడం మొదలు పెట్టాను, 2019 ఏడాది చివరి కల్లా మూడులక్షల పుస్తకాలు చదివేయాలన్నది నా టార్గెట్ అని చెప్పాడు. ఏం పుస్తక మండీ అది అని ఆమె అడిగింది. 'బెత్తం పురాణం' అని పవన్‌కళ్యాణ్ అన్నాడు. ఇందులో సబ్జెక్ట్ ఏంటని మళ్ళీ ఆమె అడిగింది. ఏ తప్పుకు ఏ శిక్ష విధించాలో ఇందులో వివరంగా వ్రాసి వుంటుంది అని పవన్ చెప్పాడు. ఒకటికి మూడు పెళ్లిళ్ళు చేసుకున్న వాళ్ళకు కూడా ఏమి శిక్ష వేయాలో ఇందులో వ్రాసి వుంటుందా? అని ఆమె మళ్ళీ అడిగింది. నేనింకా ఈ పుస్తకం లోతుల్లోకి పోలేదు, చదివాక ఆ వివరాలు చెపుతాను అని పవన్ కసురుకోవడంతో ఆమె ముసుగు తన్ని పడుకుంది. పవన్ ఆ పుస్తకాన్ని ఎంతో శ్రద్ధగా చదువుతూ అట్లాగే నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

అది రంగారెడ్డి జిల్లాలోని ఒక తహశీల్దార్ కార్యాలయం. ఓ బక్కచిక్కిన రైతు తన పొలానికి పాస్‌పుస్తకాలు ఇప్పించమని తహశీల్దార్ దండకాలావు కాళ్లపై పడి వేడుకుంటున్నాడు. అయినా ఆ తహశీల్దార్ కనికరం లేకుండా 10వేలు లంచం ఇస్తేనే పాస్‌బుక్‌లిస్తామని ఖరాఖండీగా చెప్పాడు. దీంతో పూర్తి నిస్పృహకు గురైన రైతు పురుగుల మందు తాగాడు. చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ రైతును స్థానికులు ఆసుపత్రిలో చేర్చారు. లంచగొండి తహశీల్దార్ మాత్రం ఆరోజు కలెక్షన్ పర్సులో పెట్టుకుని కారెక్కి తన ఇంటికి బయలుదేరాడు. అలా వెళ్తుండగా సడెన్‌గా డ్రైవర్ కారుకు సడెన్ బ్రేక్ వేశాడు. తహశీల్దార్ ముందుకు తూలి పడి డ్యాష్‌బోర్డును కొట్టుకున్నాడు. కొద్దిసేపటికి తేరుకుని ఎందుకు సడెన్ బ్రేక్ వేశావని డ్రైవర్‌ను ప్రశ్నించాడు. డ్రైవర్ సమాధానం చెప్పకుండా తన వేలితో రోడ్డువైపు చూపించాడు. రోడ్డు మీద ఒక నల్లటి ఆకారం వుంది. అతని చేతిలో పొడవాటి బెత్తం వుంది. తహశీల్దార్ దండకాలరావు భయపడుతూ కారు దిగాడు. గద్గద స్వరంతో ఎవరు నువ్వు అని ఆ ఆకారాన్ని ప్రశ్నించాడు. అప్పుడు ఆ ఆకారం... చూడు సిద్దప్పా, నేను సింహంలాంటోడ్ని, దానికి గడ్డం తీసు కోవడానికి బ్లేడ్ వుండదు, నాకు వుంటుందంతే తేడా... మిగతావంతా సేమ్ టు సేమ్... అని డైలాగ్ వదిలాడు. అప్పుడు దండకాలరావు ఏదో కనుగొన్నట్లుగా... నువ్వు పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్‌వి కదా అని అడిగాడు. దానికి ముసుగు వ్యక్తి... అది పగటిపూట, ఇప్పుడు మాత్రం నా పేరు బెత్తంబాషా, నీలాంటి అవినీతి పరుల ఆటకట్టించడానికి వచ్చిన కొణిదెల వీరవెంకట బెత్తంబాషా అని చెప్పాడు. అది సరే, ఇప్పుడు నన్నెందుకు ఆపావు అని దండకాలరావు అడిగాడు. దానికి బెత్తం బాషా... ఈరోజు నీ లంచం దాహం మూలంగా ఓ రైతు పురుగుల మందు తాగి చావుబతుకుల్లో వున్నాడు. ఒక పురుగు మందు డబ్బా నీవల్ల వేస్ట్ అయ్యింది. అందుకు నీకు శిక్ష ఏంటో తెలుసా? అని అంటుండగా అతనికి రంగారెడ్డి జిల్లా తహశీల్దార్ విజయారెడ్డి సంఘటన గుర్తుకొచ్చి... ప్లీజ్ నన్ను చంపొద్దు, నన్ను చంపొద్దు... రేపటి నుండి ఎవరినీ లంచం అడగను అని కాళ్లు పట్టుకుని బ్రతిమలాడసాగాడు. అప్పుడు బెత్తంబాషా... నీకు అంత సీన్ లేదు... కాల్చి చంపడం వంటి సింపుల్ శిక్షలు వుండవు.. ముందు చేయి చాపు అని అరిచాడు. దండకాలరావు చేయి చాపాడు. వెంటనే టపీటపీ మని బెత్తంతో రెండుదెబ్బలు కొట్టాడు బెత్తం బాషా. తర్వాత అతనే... లంచం తీసుకున్నావంటే రెండు బెత్తం దెబ్బలు తప్పవని హెచ్చరించాడు. అప్పుడు దండకాలరావు మళ్ళీ చెయ్యి చాపి ఇంకో 40 దెబ్బలు కొట్టండి సార్, నెలకు సరిపోతాయన్నాడు. అదేంటని బెత్తం బాషా అడిగాడు. నెలకు 20రోజులు లంచం తీసుకుంటాం కదా.. అందుకే ఒకేసారి దెబ్బలు తింటే నీకూ, నాకూ మళ్ళీ మళ్ళీ పనిలేకుండా వుంటుందన్నాడు. సరేనంటూ బెత్తంబాషా అదే పని చేశాడు.

★★★★★

అది మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల శివారు ప్రాంతం. అటుగా స్కూటీపై వెళుతున్న ఒక యువతిని నలుగురు దుండగులు అటకాయించారు. ఆమెను బలవంతంగా పక్కనేవున్న పొదల్లోకి తీసుకెళ్లి దారుణంగా అత్యాచారం చేయడమేకాక కిరాతకంగా చంపేశారు. తర్వాత తాపీగా తమ కారెక్కి రోడ్డుపై రాసాగారు. అలా వస్తుండగా రోడ్డుపై అడ్డంగా వున్న ఆకారాన్ని చూసి కారు ఆపారు. నలుగురూ కిందకు దిగి, ఎవరు నువ్వు అని ప్రశ్నించారు. బెత్తం బాషా! మీలాంటి రేపిస్ట్‌లను పనిష్ చేయడానికి వచ్చిన బెత్తంబాషాని... అని చెప్పాడు. మీ గొంతు వింటుంటే పవన్‌కళ్యాణ్ లాగున్నారే అని వారిలో ఒకడన్నాడు. దానికి అతను పగలు పవన్‌కళ్యాణ్, రాత్రికి బెత్తం బాషాను... ఇప్పుడే మీరొక అమ్మాయిని రేప్ చేసి క్రూరంగా చంపేసి వస్తున్నారు. అందుకు మీకు శిక్ష ఏంటో తెలుసా... బంబీపాకం... బెత్తం పురాణంలో ఈ నేరానికి వేసిన శిక్ష... అని చెప్పగానే... రేపిస్ట్‌లలో ఒకడు, అంటే ఏంటి సార్, మమ్మల్ని నలుగురినీ బానెలో వేసి వేంచుతారా, తుపాకీతో కాలుస్తారా? అని ప్రశ్నించాడు. అందుకు బెత్తం బాషా ఇంత చిన్న నేరాలకు అంతపెద్ద శిక్షలు లేవులే... నలుగురూ చొక్కాలు విప్పి కూర్చోండి అని ఆజ్ఞాపించాడు. వాళ్ళు అలాగే చేశారు. బెత్తం బాషా బెత్తంతో ఒక్కోడి వీపు మీద రెండేసి దెబ్బలు కొట్టాడు. అప్పుడు వాళ్ళు అతనితో... ఇంకో తలో 50 దెబ్బలు కొట్టండి బాషా గారు అని అడిగారు. ఎందుకు అని బెత్తం బాషా ప్రశ్నించాడు. ఇకముందు కూడా మేం చేయబోయే రేప్‌లకు ముందుగానే శిక్ష అమలయిపోయినట్లుంటుందని అన్నారు. ఓకే మీ నిజాయితీ నాకు నచ్చిందంటూ బెత్తంబాషా బెత్తంతో తలో 50 దెబ్బలు కొట్టసాగాడు. అలా కొడుతుండగా 'కెవ్' అనే కేక వినిపించింది. ఆ కేకకు పవన్ కళ్లు తెరిచాడు. ఆయన బెడ్ మీదే వున్నాడు. కాకపోతే ఆయన భార్య బెడ్‌పై కూర్చుని వుంది. ఆమె ముక్కు పగిలి రక్తం కారుతోంది. ఏమైంది అని పవన్ ఆదుర్దాగా అడిగాడు. మీరు నిద్రలో చేయి అటూ ఇటూ తిప్పుతూ నా ముక్కును పగలగొట్టారని చెప్పింది. అప్పుడు పవన్‌కు అప్పటిదాకా వచ్చిన కల గుర్తుకువచ్చింది. ఆ కలలో నిందితులను బెత్తంతో కొడుతున్న సీన్‌లో తాను నిజంగానే చేతులు కదిలించినట్లు గ్రహించాడు. ఎలాగూ నిద్ర పోయింది కాబట్టి లేచి నీళ్లు తాగాడు. టైం చూస్తే ఉదయం ఆరుగంటలు. ఎలాగూ తెల్లారింది కదా అని చెప్పి టీవీ ఆన్ చేసి టివి10.5×25 ఛానెల్ పెట్టాడు. అందులో బ్రేకింగ్ న్యూస్... "దిశ నిందితులు నలుగురూ ఎన్‌కౌంటర్"... ఈ వార్త చూసి పవన్ కళ్యాణ్ షాకయ్యాడు. వెంటనే సి.పి.సజ్జనార్‌కు ఫోన్ చేశాడు. అవతల ఆయన ఫోన్ ఎత్తాడు. ఇదేంటి సజ్జనార్ గారు, దిశ కేసు నిందితులను ఎన్‌కౌంటర్ చేశారు. నేను వాళ్లకు రెండు బెత్తం దెబ్బలు చాలని చెప్పాను కదా అని ప్రశ్నించాడు. దానికి సజ్జనార్...మీరు చెప్పింది గుర్తుంది సార్, కాకపోతే రాత్రి సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ కోసం నిందితులను స్పాట్‌కు తీసుకెళ్లాం, అక్కడ నిందితులు మాపై తిరగబడ్డారు. వాళ్లను అదుపులోకి తెద్దామని చూస్తే సరిగ్గా ఆ సమయంలో బెత్తాలు దొరకలేదు, అందుకే అందుబాటులో వున్న నాలుగు బుల్లెట్‌లను వాడామని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ మాటలు విని పవన్ అలాగే నిశ్చేష్టుడయ్యాడు. బెత్తం దొరకక పోవడం వల్ల అనవసరంగా నలుగురు చనిపోయారు. ఇక నుండి అన్ని పోలీస్‌స్టేషన్‌లలో బెత్తాలను అందుబాటులో వుంచాలి, ఈ విషయంపై అవసరమైతే ప్రధాని నరేంద్ర మోడీతోనైనా మాట్లాడాలని మనసులో నిర్ణయించుకున్నాడు.

# కల్యాణ వైభవం...!

### మాన్విత - నితిన్



నెల్లూరీయుడు, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న మోపూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి - మల్లికల కుమార్తె **మాన్విత - నితిన్** (హైదరాబాద్ కొంపల్లి వాస్తవ్యులు గడ్డం నారాయణరెడ్డి - వసుధల కుమారుడు)ల పరిణయం ఈ నెల 6వ తేదీ హైదరాబాద్‌లోని పోర్ట్ గ్రాండ్ నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

### భార్గవ్ - గీత



బెంగుళూరు రియల్‌ఎస్టేట్ రంగంలో వుంటున్న నెల్లూరీయుడు ముప్పాళ్ళ భాస్కర్‌రెడ్డి - ఝాన్సీల కుమారుడు **భార్గవ్ సుమంత్ - గీతకృష్ణ** (తనమళ్ళ లీలామోహన్‌కృష్ణారెడ్డి - నీరజల కుమార్తె)ల కళ్యాణం ఈ నెల 6వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### సుధీర్ - మాళ్వీక



పద్యకళా పరిషత్ అధ్యక్షులు మెట్టు రామచంద్రప్రసాద్ - పరమేశ్వరమ్మల మనుమడు, స్వర్గీయ ఒగ్గు సుధాకర్‌రావు - స్వరాజ్యలక్ష్మిల కుమారుడు **సుధీర్ - మాళ్విక** (తమిళనాడులోని మెట్టుకులం వాస్తవ్యులు జడిపిల మోహన్ - గీతల కుమార్తె)ల వివాహం ఈ నెల 6వ తేదీ కస్తూరిదేవి గార్డెన్స్ నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' ధీవెనలు.

### అమూల్య - హర్ష



నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి, సిపిఆర్ కళ్యాణ మండపం మేనేజర్ దాదు శ్రీనివాసరెడ్డి - ఉమామహేశ్వరిల కుమార్తె **అమూల్యరెడ్డి - హర్షచరణ్** (తిరుపతి రూరల్ మండలం చిగురువాడ వాస్తవ్యులు జోగిరెడ్డి రాజేంద్రప్రసాద్‌రెడ్డి - తనూజల కుమారుడు)ల పెళ్లి ఈ నెల 8వ తేదీ నెల్లూరులోని సిపిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవ దంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.



## సీఎంను కలిసిన చైర్మెన్లు

జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటి చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన వీరి చలపతిరావు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మెన్ ఆనం విజయకుమార్‌రెడ్డి ఈ నెల 12వ తేదీన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా వారిని సిఎం జగన్ అభినందించాడు. వీరితో పాటు కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కూడా సీఎంను కలిశాడు.

# పర్యాటక సిరి.. ఉదయగిరి

## ఉదయగిరి దుర్గం అభివృద్ధిపై లోక్‌సభలో ప్రశ్నించిన ఆదాల



పర్యాటకులకు కనువిందు చేసే అతి ప్రాచీనమైన ఉదయగిరి దుర్గం అభివృద్ధి ప్రతిపాదనేదీ ఇంతవరకు అందలేదని కేంద్ర పర్యాటకశాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ లోక్‌సభలో సోమవారం లిఖితపూర్వకంగా తెలిపారు. అంతకుముందు నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఉదయగిరి దుర్గాన్ని అభివృద్ధి చేసే ప్రణాళిక కేంద్ర ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. ఉంటే దాని కోసం తీసుకున్న చర్యలు ఏమిటని, అలా కాకుంటే దానికి కారణాలు ఏమిటని ఆయన లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్‌సింగ్ పటేల్ జవాబు చెబుతూ స్వదేశీ దర్శన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం దేశంలోని కొన్ని ప్రాంతాలను ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి చేస్తుందని తెలిపారు. అయితే దీని కోసం రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదిస్తుందని, ఇది ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే సమగ్ర నివేదికను బట్టి నిధులను విడుదల చేస్తుందని తెలిపారు. 2015 -16 ఆర్థిక సంవత్సరంలో తీర ప్రాంత అభివృద్ధిలో భాగంగా నెల్లూరు జిల్లాలోని పులికాట్ సరస్సు, నేలపట్టు, ఉబ్బలమడుగు జలపాతం, కొత్తకోడూరు, మైపాడు, రామతీర్థం, ఇస్కపల్లి ప్రాంతాల అభివృద్ధికి గాను 59.70 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని పేర్కొన్నారు. అయితే ఇందులో ఉదయగిరి దుర్గాన్ని చేర్చలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ప్రతిపాదన వస్తే పరిశీలిస్తామన్నారు. ఉదయగిరిని పర్యాటక కేంద్రంగా మార్చాలన్న ప్రతిపాదన ఎన్నో ఏళ్ళుగా ప్రకటనలకు, పత్రికలకే పరిమితమౌతోంది. దీని అభివృద్ధిపై నిర్ధిష్టమైన ప్రణాళికను ఎవ్వరూ రూపొందించడం లేదు.నెల్లూరు పార్లమెంటు సభ్యులుగా ఆదాల ఈ విషయంలో కొంచెం శ్రద్ధ పెడితే ఈ దిశగా ముందడుగు పడొచ్చు.

అలాగే 12వ తేదీన లోక్‌సభలో ఆయన జాతీయ జలవిధానాన్ని సవరించిన అంశంపై కేంద్రాన్ని ప్రశ్నిస్తూ... ఒకవేళ ఈ విధానాలు సవరించే ప్రతిపాదనలు వుంటే, దానిలో ఆంధ్రప్రదేశ్‌ను చేర్చారా అని ప్రశ్నించారు. దీనికి కేంద్ర జలవనరుల శాఖామంత్రి రతన్‌లాల్ కటారియా లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ ప్రస్తుత దేశ అవసరాలను దృష్టిలో పెట్టుకుని 2012 జాతీయ జల విధానాన్ని సవరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుత దేశ అవశరాలు పెరిగిపోయాయని, ఆయా రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నవంబర్ 5వ తేదీన ఒక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ నివేదిక ఇచ్చాక ఒక సమగ్ర విధానాన్ని రూపొందిస్తామని తెలియజేశారు.

# ముంబై మెట్రోకి శ్రీసిటీ రైళ్ళు

## తయారీకి ఆల్‌స్టామ్ అంకురార్పణ



ముంబై మెట్రో లైన్ 3 ప్రాజెక్టు కోసం మెట్రో ట్రైన్ సెట్ల నిర్మాణ పనులను శ్రీసిటీలోని ఆల్‌స్టామ్ పరిశ్రమ మంగళవారం ప్రారంభించింది. ఆల్‌స్టామ్ ఇండియా, దక్షిణాసియా విభాగాల మేనేజింగ్ డైరెక్టర్ అలైన్ స్పార్ నేతృత్వంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆల్‌స్టామ్ పరిశ్రమ ఆవరణలో నిర్వహించారు.

ఈ సందర్భంగా అలైన్ స్పార్ మాట్లాడుతూ, ఈ మెట్రో ట్రైన్లు భారతదేశ వాణిజ్య రాజధానిలో ప్రజారవాణాకు కొత్త రూపాన్ని అందించనున్నాయన్నారు. ముంబై అవసరాల కోసం ప్రత్యేకంగా ఈ రైళ్లు తయారుచేస్తున్నామని, ఒక ట్రిప్‌లో 300మంది ప్రయాణించేందుకు వీలు కలుగుతుందన్నారు. భారతదేశంలో అతిపెద్ద ఆల్‌స్టామ్ తయారీ ప్లాంట్ అయిన శ్రీసిటీ ప్లాంట్‌లో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ, ఏడాదికి 240 నుంచి 480 రైళ్లను తయారు చేసేందుకు తాము శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ప్రస్తుతం చెన్నై మెట్రో, మాంట్రియల్ మెట్రో (కెనడా), ముంబై మెట్రో లైన్ 3 ఆర్డర్లకు అనుగుణంగా రైళ్ల ఉత్పత్తి జరుగుతోందని, సిడ్నీకి చెందిన మరో ప్రాజెక్టు ఒప్పందం కూడా జరిగిందని ఆయన తెలిపారు. మరో ముఖ్యమైన మైలు రాయిని అధిగమించిన ఆల్‌స్టామ్ ఇండియా టీంకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు.

### ఆకర్షించిన 'ఫియట్' కార్ల ప్రదర్శన



పాతతరంలో ఎంతో వైభవంతో వెలుగొందిన ఫియట్ కార్ల మోడళ్ళన్నీ ఒక్కసారిగా శ్రీసిటీని అలరించి తమ అందచందాలను ప్రదర్శించాయి. ఈ అద్భుతమైన కార్ల ప్రదర్శన శ్రీసిటీలో ఈనెల 8వతేదిన జరిగింది.



ఈ నెల 12వ తేదీన కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా తాడేపల్లిలోని తన నివాసంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, స్వీటు తినిపిస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి, పక్కన అదేరోజు పుట్టినరోజు జరుపుకున్న మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

# కల్యాణ వైభోగం...!




నెల్లూరీయులకు సుపరిచితులు, సుప్రసిద్ధ సీనియర్ న్యాయవాది దివంగత గునుపాటి ఆదిశేషారెడ్డి మనుమరాలు, గునుపాటి మురళీకృష్ణారెడ్డి - శ్రీమతి ప్రతిమల కుమార్తె **మౌనిక - నిర్ణిత్** (దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి - సుప్రియల కుమారుడు)ల కల్యాణం మలేసియా దేశంలోని "లంకావి"లో డిసెంబర్ 7వ తేదీన వైభవోపేతంగా జరిగింది. డిసెంబర్ 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగిన పలు వేడుకలలో గునుపాటి, దేవిరెడ్డి కుటుంబసభ్యులతో పాటు ఆప్తులు ఆత్మీయులు పాల్గొని నవ వధూవరులను ఆశీర్వదించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి తల్లి శ్రీమతి విజయమ్మతో పాటు వైయస్ కుటుంబసభ్యులు అనేకమంది ఈ వేడుకలో పాల్గొన్నారు. 7రోజుల పాటు జరిగిన అన్ని పెళ్లి సంబరాలను పెళ్లికుమార్తె పెద్దనాన్న రెడ్డి ల్యాబ్స్ వైస్‌ఛైర్మెన్ జి.వి.ప్రసాద్‌రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. మౌనిక - నిర్ణత్‌లకు 'లాయర్' శుభాశీస్సులు.

# జనవరి నుంచి సచివాలయ పాలన

జనవరి నుంచి గ్రామ సచివాలయ పాలన పూర్తి స్థాయిలో ప్రారంభం కానుం దని జిల్లా పంచాయితీ అధికారి అనూరాధ తెలిపారు. ఈనెల10న నెల్లూరు దర్గామిట్ట లోని తన కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో 665 సచివాలయ భవనా లకు వసతులు కల్పిస్తున్నామని, ఇంటర్నెట్, విద్యుత్, కుర్చీలు, బల్లలు, ఇతర స్టేషనరీని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. 264 నూతన పంచాయితీ భవనాల నిర్మాణా లకు ఎస్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా నిధులు విడుదల అయ్యాయని, 237 పంచాయి తీల్లో అదనపు గదులను నిర్మిస్తున్నామన్నారు. 110 అద్దె భవనాల్లో సచివాలయా లను ఏర్పాటు చేశామని, మరో 161 పంచాయితీ భవనాలకు నిధుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు.

# మౌనం వీడిన ఆనం

(మొదటి పేజీ తరువాయి)

రాజశేఖరరెడ్డి హయాంలోనూ, ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి పాలనలోనూ వారి ఆధిపత్యానికి తిరుగు లేకుండా పోయింది. ఓ దశలో కాకలు తీరిన రాజకీయ యోధుడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డిని సైతం వెనక్కి నెట్టేశారు. నెల్లూరుజిల్లాలో ఏ పని జరగాలన్నా, ఏ అధికారి ముందుకు కదలాలన్నా 'ఆనం' ఆజ్ఞాపించాలనేంతగా ఆధిపత్యం చూపారు. జిల్లా రాజకీయాలను అంతగా శాసించిన 'ఆనం' కుటుంబం జిల్లాలో నేడు చోటుచేసుకున్న పరిస్థితులను తట్టుకోలేకపోతోంది. తమ పాఠశాలలో రాజకీయ ఓనమాలు నేర్చుకున్నవాళ్ళు మంత్రులుగా తమ మీదే పెత్తనం చెలాయిస్తుంటే, తమకే సవాళ్ళు విసురుతుంటే జీర్ణించుకోలేకపోతోంది. దీని ఫలితమే ఇటీవల పేలిన ఆనం విస్ఫోటనం.

ఈమధ్య వెంకటగిరి శాసనసభ్యుడు ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు పెను సంచలనానికి దారి తీయడం తెలిసిందే! నెల్లూరు నగరంలో ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా, బెట్టింగ్ మాఫియా రాజ్యమేలుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారంటూ బాంబు పేల్చాడు. అధికారులు సైతం తమ ఉద్యోగ భద్రతను దృష్టిలో వుంచుకుని రాజకీయ నాయకుల అడుగులకు మడుగులొత్తే పరిస్థితి దాపురించిందంటూ... గత ఐదేళ్ళలో నలుగురు ఎస్పీలను మార్చుకున్న జిల్లా నెల్లూరుజిల్లా ఒక్కటేనని వ్యాఖ్యానించాడు.

ఆయన నెల్లూరు నగర, రూరల్ ఎమ్మెల్యేలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యక్షంగా ఈ విమర్శలు చేసినా, పరోక్షంగా అవి ప్రభుత్వంపై చేసినట్లుగానే వున్నాయి. దీంతో వైసిపి అధిష్టానం సీరియస్ అయ్యింది. ఎందుకంటే సొంత పార్టీ ఎమ్మెల్యేనే ప్రభుత్వ పనితీరును తప్పు పట్టినట్లుగా మాట్లాడడంతో ప్రతిపక్షాలకు ఒక అస్త్రం దొరికినట్లయ్యింది. బీద మస్తాన్‌రావు పార్టీలో చేరిన సమయంలో విజయసాయిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఘాటుగానే స్పందించాడు. పార్టీలో తానైనా, వై.వి.సుబ్బారెడ్డి అయినా రామకృష్ణారెడ్డైనా ఎవ్వరూ అతీతులు కారని, పార్టీ అధినాయకుడు జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఆయన చెప్పినట్లుగా ఎవ్వరైనా సరే నడుచుకుని తీరాలని, అలాకాని పక్షంలో క్రమశిక్షణా చర్యలు తప్పవని గట్టిగా మందలించాడు.

## వ్యూహాత్మకంగానే చేశారా?

ఆనం రామనారాయణరెడ్డి లాంటి సీనియర్ నాయకుడు, ఏ పార్టీలో ఎలా వుండాలో తెలిసిన నాయకుడు ఇంత ఘాటుగా విమర్శలు చేయడం వెనుక కారణాలు లేవనుకోలేము. ఎంతో అసంతృప్తితో వుంటేగాని ఆయన ఈ ఆరోపణలు చేయడు. ఆయన అసంతృప్తికి, ఆగ్రహానికి కొన్ని బలమైన కారణాలు కనిపిస్తున్నాయి.

నెల్లూరులోని విఆర్ విద్యాసంస్థలపై దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఆనం ఆధిపత్యం కొనసాగుతోంది. కాంగ్రెస్ హయాంలో వారికి తిరుగులేకుండా ఉండేది. ఆఖరకు తెలుగుదేశం ప్రభుత్వంలో కూడా విఆర్ విషయంలో వారిని పక్కన పెట్టాలనుకోలేదు. కాకపోతే కోర్టు తీర్పు వల్ల విఆర్ విద్యాసంస్థలకు ప్రభుత్వం ప్రత్యేకాధికారిని నియమించింది. వైసిపి అధికారంలోకి వచ్చాక విఆర్ విద్యాసంస్థలపై ఆనం ముద్ర లేకుండా చేయడానికి, పూర్తిగా ప్రభుత్వం ఆధీనంలో వుంచడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. అలాగే ఎప్పుడూ లేనివిధంగా ఆనం ఆధిపత్యం వుండే మూలాపేటలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తెచ్చే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇక ఆయనతో సంబంధం లేకుండానే వెంకటగిరి నియోజకవర్గ పరిధిలోని అల్తూరుపాడు లిఫ్ట్ కెనాల్ కాంట్రాక్ట్‌ను రద్దు చేశారు. ఇవికాక ఇంకెన్నో రాజకీయ కారణాలు కూడా ఆనం ఆవేశం వెనుక వున్నాయని తెలుస్తోంది.

## సీనియార్టీ వున్నా... ప్రైయార్టీ సున్నా!

జిల్లాలో వున్న పదిమంది ఎమ్మెల్యేలలో సీనియర్ రామనారాయణరెడ్డి. అయినా వైయస్ జగన్మోహన్‌రెడ్డి వద్ద ప్రైయార్టీలో ఆయనది చివరి స్థానమే! ఎందుకంటే 2009లో వైయస్ రాజశేఖర రెడ్డి మరణానంతరం జరిగిన పరిణామాలు జగన్‌కు ఆనంకు మధ్య గ్యాప్‌ను పెంచాయి. 2014 ఎన్నికల తర్వాత ఆనం సోదరులు కాంగ్రెస్‌ను వదిలి తెలుగుదేశంలోకి వెళ్లడం, అక్కడ వుండి జగన్‌పై పెద్దఎత్తున విమర్శలు చేయడం వంటివి కూడా ఈ దూరాన్ని ఇంకా పెంచాయి. నిన్నటి ఎన్నికలలోనైనా 2014 ఎన్నికల్లో చేసిన తప్పులు పునరావృతం కాకూడదనే జగన్ ఆనంను వైసిపిలోకి చేర్చుకుని ఆయనకు వెంకటగిరి సీటిచ్చారు. ఆనం రామనారాయణరెడ్డి 2014కు ముందే పార్టీలోకి వచ్చివుంటే ఈరోజు ప్రభుత్వంలో ఆయన స్థానం వేరేగా వుండేది! ఇప్పుడు పరిస్థితులు మారి ఆయన ప్రాధాన్యత తగ్గిపోయింది.

ఆనం కూడా పార్టీలో తనకు ఇంతకంటే మంచి పొజిషన్ రాకపోవచ్చనే ఉద్దేశ్యంతో వున్నాడు. ఆయనకు ఇక మంత్రి, స్పీకర్ వంటి పదవులు రావు. వున్న ఎమ్మెల్యే పదవి వూడిపోయేదేమీ కాదు. కాని, ఈ పార్టీలోనే వుంటూ ఈ పార్టీ నాయకులే తమకు సవాళ్ళు విసురుతుంటే ఇకముందు ఆనం సహించకపోవచ్చు. ఒకవేళ ఈరోజు ఆనం రామనారాయణరెడ్డి తనకు తాను చల్లబడ్డా, మున్ముందు కాలంలో ఇలాంటి పరిణామాలే కొనసాగుతుంటే మాత్రం పార్టీలో అసంతృప్తి అనే పిల్లి మెడకు ఆయనే గంటకట్టినా ఆశ్చర్యం లేదు.

# నేత్రపర్వంగా..హనుమద్వ్రతం

## శబరి శ్రీరామక్షేత్రానికి పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం

ఈనెల 10న హనుమద్వ్రతాన్ని పురస్కరించుకుని నెల్లూరు నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో కొలువైవున్న శ్రీ ప్రసన్నాంజ నేయస్వామికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో నగరంలోని భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. తొలుత స్వామివారిని 18 రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. ఆ తర్వాత లక్ష తమలపాకులతో సహస్రనామార్చన చేశారు. సామూహికంగా జరిగిన ఈ పూజల్లో అనేకమంది భక్తులు పాల్గొన్నారు. అనంతరం శాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఆలయ అర్చకులు రామచంద్రాచార్యులు, మహేష్‌స్వామి, రాజమన్నార్‌స్వామి నేతృత్వంలో ఈ విశిష్టపూజలు జరిగాయి. ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఈ విశిష్ట సేవలకు ఉభయకర్తగా వ్యవహరించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. అన్నం దయాకర్‌గౌడ్, సత్యనారాయణ, చంద్రారెడ్డి, రామ్‌నగర్ మిత్రబృందం సభ్యులు పర్యవేక్షించారు.

# మీరొస్తామంటే... మేమొద్దంటామా?

(మొదటి పేజీ తరువాయి)

చేయాలనే దిశగానే వైసిపికి ఎన్డీఏలో చేరమని ఆహ్వానం వెళ్లింది. మీరొచ్చి చేరితే చంద్రబాబు, పవన్‌లు మాకు దగ్గర కావాలనే ప్రయత్నాలను మానుకుంటారని అమిత్‌షానే వైసిపి నేతలతో అన్నట్లు తెలుస్తోంది. అయితే ఎటువంటి హామీలు లేకుండా ఎన్‌డిఏలో వైసిపి చేరకపోవచ్చు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా కావాలన్న జగన్ డిమాండ్ అలానే వుంది. కేంద్రం నుండి రాష్ట్రానికి ఆర్థిక సహకారం అంతంత మాత్రంగానే అందుతోంది. రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించి బలమైన హామీలు ఇస్తేనేగాని ఎన్డీఏలో చేరడానికి వైసిపి మొగ్గు చూపకపోవచ్చు. అయితే ఈ రెండు పార్టీల మధ్య సమన్వయం కుదిరితే మాత్రం రాష్ట్రానికి అభివృద్ధి పరంగా మేలు జరిగినట్లే!

## సొంత మార్గాన్ని వదులుకోవడమే!

వైసిపిని ఎన్డీఏలో చేర్చుకుంటే మాత్రం బీజేపీ వాళ్ళు ఏపిలో ఎదగడానికి వున్న అవకాశాలను ఇంకో ఐదేళ్లు వాయిదా వేసుకోవడమే అవుతుంది. వైసిపితో కలిస్తే మళ్ళీ గెలవొచ్చు. అయితే బీజేపీ మాత్రం వైసిపి మిత్రపక్షంగా మిగిలిపోతుంది. తెలుగుదేశానిది రెండో స్థానమే అవుతుంది! అలాకాకుండా రాష్ట్రంలో ఇప్పుడున్న పరిస్థితులను అవకాశంగా మలచుకుని ముందు వాళ్ళు తెలుగుదేశంను నిర్వీర్యం చేయాలి. చంద్రబాబును అశక్తుడిగా మార్చాలి. మమ్మల్ని కాపాడాలంటూ ఆయనే బీజేపీ వద్దకు వెళ్లాలి. అప్పుడు తెలుగుదేశం కేడర్‌ను కలుపుకుని బీజేపీ ఈ రాష్ట్రంలో సొంతంగా బలంగా ఎదగడానికి అవకాశం వుంటుంది. అంటే ఏపిలో రెండో స్థానాన్ని ఆక్రమించుకుంటుంది.

ఇక తెలుగుదేశంతో సంబంధం లేకుండా జనసేనను కలిపేసుకుని పవన్ కళ్యాణ్‌ను ముందు పెట్టుకుని ఏపిలో రాజకీయ పోరు సాగించాలనే ఆలోచన కూడావుంది. అయితే ఇది దండగమారి ప్రయోగం. ఏపిపై ఇప్పట్లో కన్ను లేకుంటే వైసిపితో కలిసి సాగడం, లేదు వైసిపిని రాజకీయ ప్రత్యర్థిగా చూసి పోరాడాలంటే తెలుగుదేశాన్ని నిర్వీర్యం చేసి ఆ కేడర్‌ను కలుపుకుని బీజేపీ పార్టీ పరంగా ముందుకుపోవడం వారి ముందున్న మార్గం.

# శ్రద్ధాంజలి



## ఆనం వెంకటకృష్ణారెడ్డి (A.V.K)

జననం : 24.04.1937 మరణం : 30.11.2019

మనసు, మమత పంచిన భర్తగా,
ప్రేమానురాగాలు కురిపించిన తండ్రిగా,
ఆత్మీయానురాగాలతో మురిపించిన తాతగా,
ఆయన లేని లోకం... మాకు తీర్చలేని శోకం.

ఆయన జీవితం ఓ మధురమైన గతమైనా...
ఆయన జ్ఞాపకాలే ఎప్పటికీ మా గుండెచప్పుళ్ళు.

ఆ మహనీయుని ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

భార్య - **ఆనం లలిత**

| కుమార్తెలు | అల్లుళ్ళు |
|---|---|
| **తిక్కవరపు వెంకట సుజలారెడ్డి** | **తిక్కవరపు రామచంద్రారెడ్డి** |
| **బిరుదవోలు వెంకట సుబల** | **బిరుదవోలు విక్రమ్‌రెడ్డి** |

మనుమళ్ళు

**తిక్కవరపు రోహిత్‌రెడ్డి** **బిరుదవోలు వైద్యత్‌రెడ్డి**
**తిక్కవరపు రితేష్‌రెడ్డి** **బిరుదవోలు విఖ్యాత్‌రెడ్డి**

**ఉత్తరక్రియలు :** వారి ఉత్తరక్రియలు తేది. 14.12.2019 శనివారం ఉ॥ 10.30 గంటలకు నెల్లూరు, ముత్తుకూరురోడ్డు, శ్రీ కృష్ణ అవెన్యూలోని మా స్వగృహము ఏ.వి.కె.విల్లా నందు జరుగును. కావున బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com